www.trinetnews.com

తెలంగాణ ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 34 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు శుక్రవారం సెప్టెంబర్ 11,2026 పేజీలు:12 వెల.10/-

బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!



2లో

# బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి

- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర చేస్తోంది
- అధికారం పోయినా బీఆర్ఎస్ అహంకారం పోలేదు
- పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడం సరికాదు
- స్పీకర్‌ను అభ్యంతరకరంగా దూషించారని సీఎం ఆగ్రహం
- ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు."వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి" అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. ఈ 48 గంటలు కీలకం!



2లో..

ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడింది. ఉత్తర బంగాళాఖాతం, బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో.. 2026 సెప్టెంబర్ 10వ తేదీ ఉదయం 5:30 గంటలకు అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది.దీని ప్రభావంతో రానున్న 48 గంటల్లో ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచనున్నాయి. గరిష్ఠంగా గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.



## బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు

- కేసులో హరీశ్‌రావు, కేటీఆర్ సహా నలుగురు
- సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి కూడా నిందితులుగా నమోదు
- మహిళా పోలీసులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు
- దాడి, బెదిరింపులు, అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు
- అసెంబ్లీ వద్ద పోలీసులతో బీఆర్ఎస్ నేతల వాగ్వాదం
- బ్లాక్ టీషర్ట్‌లతో వచ్చిన నేతలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత

2లో

బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు నమోదయ్యింది. మహిళా పోలీసులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో గురువారం ( సెప్టెంబర్ 10 ) కేసు నమోదు చేశారు సైఫాబాద్ పోలీసులు. ఈ కేసులో నిందితులుగా హరీష్ రావు, కేటీఆర్, సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డిలను చేర్చారు పోలీసులు.




## బయట బీఆర్ఎస్.. సభలో బీజేపీ అలజడి

- రెండు పార్టీలు సభా సమయాన్ని వృథా చేస్తున్నాయి
- ఇప్పటికే 3 రోజులు వృథా చేశారన్న ప్రభుత్వ విప్
- ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- స్పీకర్ అవమానంపై చర్చకు బీఆర్ఎస్ వెనుకంజ
- 22ఏపై చర్చకు బీజేపీ గందరగోళం సృష్టిస్తోందని ఆరోపణ

**హైదరాబాద్:** బయట భారాస.. సభ లోపల భాజపా గందరగోళం సృష్టిస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. రెండు పార్టీలు సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మండిపడ్డారు."ప్రజా సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారాలు కనుగొనాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. రెండు పార్టీలు కుయుక్తులు పన్ని సభలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పటికే 3 రోజులు వృథా.. ప్రజా సమస్యల కంటే ఫక్తు రాజకీయాలు చేసే యత్నం మాను కోవాలి. స్పీకర్‌పై జరిగిన అవమానంపై చర్చ జరపాలంటే బీఆర్ఎస్ చర్చించదు. 22ఏపై చర్చ జరపాలంటూ సభలో గందరగోళం సృష్టించేందుకు భాజపా యత్నిస్తోంది. ప్రతి ప్రజా సమస్యపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని ఆది శ్రీనివాస్ తెలిపారు.

## అప్పుడే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది: డొనాల్డ్ ట్రంప్

అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన తర్వాతే ఇరాన్‌తో యుద్ధం ముగుస్తుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 100 డాలర్లకు చేరిన చమురు ధరలు కూడా అప్పుడే తగ్గుతాయని అంచనా వేశారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా బలగాలు తమ పోరాటాన్ని ఉద్ధృతం చేయడంతో.. టెహ్రాన్ ఇక ఎక్కువకాలం దాడులను తట్టుకోలేదని వ్యాఖ్యానించారు. తమ మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.



మిగతాది 2లో

## రూ.5 లక్షలు సరిపోవు.. సాయం పెంచాలి



2లో

- నిర్మాణ ఖర్చు రూ.12 లక్షల వరకు పెరిగింది
- లేబర్ ఖర్చే రూ.3 లక్షలు అవుతోంది
- ఇళ్ల కోసం బంగారం అమ్ముకుంటున్న పేదలు
- ఇళ్ల సంఖ్య తగ్గించినా.. ఒక్కో ఇంటికి సాయం పెంచాలి
- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో వర్గాల వారీ వాటా స్పష్టం చేయాలి: అక్బరుద్దీన్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంత శాతం?

**హైదరాబాద్:** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.5 లక్షల సాయం సరిపోవడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో రూ.5 లక్షలతో పూర్తయ్యే ఇల్లు ప్రస్తుతం రూ.12 లక్షల వరకు ఖర్చవుతోందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయం పెంచాలని సూచించారు.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్



2లో..

## 46 చోట్ల టీజీ సేఫ్ అధికారుల దాడులు.. పురుగులు పట్టిన ఆహారం గుర్తింపు

**హైదరాబాద్:** తెలంగాణలోని పలు హోటళ్లు, స్వీట్‌షాప్‌లు, హాస్టళ్లు, రెస్టారంట్లు, బేకరీలు, దాబాలపై టీజీ సేఫ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. కోర్ అర్బన్ రీజియన్ వెలుపల పలు జిల్లాల్లోని 46 ఆహార సంస్థల్లో అధికారులు తనిఖీలు చేశారు. పలుచోట్ల కల్తీ, కలుషిత మాంసం, కుళ్లిపోయిన కూరగాయలను గుర్తించారు.



2లో..

## హద్దులు ఉండాల్సిందే..

### చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సుప్రీం

**ఇంటర్నెట్‌డెస్క్:** చిన్నారులు సోషల్ మీడియా వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు డిజిటల్ వేదికలను సులభంగా వినియోగించే అవకాశం ఉందని, అందుకే వారికి రక్షణ కల్పించేలా హద్దులు ఉండాల్సిందేనని సూచించింది. మైనర్లు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే విషయంలో రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ వేధింపుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.







## ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్ వైఫల్యం: హరీశ్‌రావు

- రైతులకు 7--8 గంటల కరెంట్ కూడా రావడం లేదు
- నీళ్లు ఇవ్వలేరు.. కరెంట్ ఇవ్వలేరు: హరీశ్
- భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్లాంట్ ఎందుకు బంద్ చేశారు?
- యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడపలేకపోతున్నారు
- రైతుల కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపణ

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఇచ్చేందుకు పవర్ లేదని, ప్రతి పక్షాల పీక నొక్కేందుకు మాత్రం కాంగ్రెస్‌కు పవర్ ఉందా? అని నిలదీశారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు. రాష్ట్ర రైతులకు కనీసం ఇప్పుడు 7 నుంచి 8 గంటల కరెంట్ కూడా రావడం లేదని హరీష్‌రావు విమర్శించారు.

## హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం.. పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లి..



2లో

## సచివాలయంలో ఏసీబీ సోదాలు

- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబాటు
- సీఎం రిలీఫ్ ఫండ్ కోసం రూ.లక్ష లంచం డిమాండ్
- సెక్షన్ ఆఫీసర్ వినోద్ అరెస్ట్
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర కూడా అదుపులోకి
- ఇద్దరినీ నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలింపు





2లో..

**హైదరాబాద్:** తెలంగాణ సచివాలయంలో ఏసీబీ సోదాలు జరిగాయి. సెక్రటేరియట్ ఆవరణలోని టెంపుల్ దగ్గర లంచం తీసుకుంటుండగా ఒకరిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

## రూ.5 లక్షలు సరిపోవు..

# సాయం పెంచాలి

మొదటి పేజీ తరువాయి



కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తాజాగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇళ్ల నిర్మాణం కోసం తమ భార్యల బంగారం కూడా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణంలోనే లేబర్ కాస్ట్ దాదాపు రూ. 3 లక్షల వరకు అవుతోంది. అందువల్ల ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల సాయాన్ని పెంచే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఇళ్ల సంఖ్య కొంత తగ్గించినా ఫర్వాలేదని, అయితే ఒక్కో ఇంటికి ఇచ్చే ఆర్థిక సాయాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.
కాగా, ప్రస్తుతం ప్రభుత్వం సొంత స్థలం ఉన్న అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో సామాజిక వర్గాల వారీగా కేటాయింపులపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం మైనార్టీలకు ప్రత్యేకంగా ఇళ్ల కేటాయింపుపై జీవో ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రెండు లక్షల ఇళ్లు ఇస్తామని చెబుతోందని, ఆ రెండు లక్షల ఇళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంత శాతం కేటాయిస్తున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## సచివాలయంలో ఏసీబీ సోదాలు

మొదటి పేజీ తరువాయి

దొరికిన వ్యక్తి మరొక వ్యక్తి పేరు చెప్పడంతో ప్రస్తుతం ఒక అధికారిని నాంపల్లి ఏసీబీ కార్యాలయంలో విచారణ చేస్తున్నారు. మరొక అధికారి ఉన్నట్టు సమాచారం. ఇంకా సెక్రటేరియట్ లో సోదాలు కొనసాగుతున్నాయి. తెలంగాణవార్తలు
సీఎం రిలీఫ్ ఫండ్ విషయంలో అధికారి రెండు లక్ష రూపాయలకు గాను లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశారు. లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సదరు అధికారిని అదుపులోకి తీసుకున్నారు. సచివాలయంలోని సెక్షన్ ఆఫీసర్ వినోద్?తో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రలను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించి అధికారులు విచారిస్తున్నారు.

## హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం..
## పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లి..

మొదటి పేజీ తరువాయి

నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ఆటోను తప్పించబోయి పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. దిల్‌సుఖ్‌నగర్ డిపోనకు చెందిన బస్సు చౌటుప్పల్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ కారు పూర్తిగా ధ్వంసం కాగా.. మరో వాహనం దెబ్బతింది. డీజిల్ పంపు వద్దకు దూసుకెళ్లడంతో దానికి సంబంధించిన పరికరాలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ప్రమాదంతో బంక్ సిబ్బంది, అక్కడ ఉన్నవారు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు. అతివేగం కారణంగా బస్సు అదుపుతప్పినట్లు సమాచారం. దీనికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.?

## బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు..
## నిందితులుగా హరీశ్‌రావు, కేటీఆర్, సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి...

మొదటి పేజీ తరువాయి

మహిళా పోలీసులను అవమానించారన్న ఫిర్యాదు మేరకు BNS 74, 75(1)(3), 79, BNS 121(1), 190, 132, BNS 296, 351(2), 352, దీపీూ 3(5) సెంక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు పోలీసులు.
దాడి, బెదిరింపులు, అసభ్య ప్రవర్తన ఆరోపణల కింద కేసు నమోదు చేశారు పోలీసులు.విధులకు ఆటంకం కలిగించారని... మహిళా పోలీసులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొంది బాధితురాలు.
తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నానా హంగామా సృష్టించారు. బ్లాక్ టీ షర్ట్స్ తో వచ్చిన నేతలను అసెంబ్లీలోకి అనుమతించకపోవడంతో పోలీసులపై రెచ్చిపోయారు బీఆర్ఎస్ నేతలు. పోలీసులను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తతకు దారి తీసింది.

## ఇది కాలం తెచ్చిన కరువు కాదు..
## రేవంత్ వైఫల్యం: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

(గురువారం, సెప్టెంబర్ 10వ తేదీ) తెలంగాణ భవన్ నుంచి మాట్లాడిన హరీష్‌రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యంతో తెలంగాణ రైతాంగ కష్టాలు చూడాల్సి వస్తుందన్నారు.
'ఒకవైపు నీళ్లు ఇవ్వలేవు.. కరెంట్ ఇవ్వలేవు.. ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా?' అని ప్రశ్నించారు. అసలు రైతులకు ఎందుకు కరెంట్ ఇవ్వలేకపోతున్నారని సూటిగా నిలదీశారు. భద్రాద్రి, కొత్తగూడెం పవర్ ప్లాంట్ ఎందుకు బంద్ చేశావ్ రేవంత్ అని ప్రశ్నించారు. ఇక యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో నడపలేకపోతుంది ఈ ప్రభుత్వం అంటూ ధ్వజమెత్తారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, రేవంత్ పరిపాలనా వైఫల్యమని హరీష్ మండిపడ్డారు.

## 46 చోట్ల టీజీ సేఫ్ అధికారుల దాడులు..
## పురుగులు పట్టిన ఆహారం గుర్తింపు

మొదటి పేజీ తరువాయి

పలు ఆహార పదార్థాలపై బొద్దింకలు, ఈగలు, ఎలుకలు తిరుగుతుండడాన్ని గుర్తించారు. పలు చోట్ల శుభ్రత లేని రిఫ్రిజిరేటర్లు, ఒకేచోట వెజ్, నాన్‌వెజ్ ఆహారం పక్కపక్కనే కలిపి ఉంచడం వంటివి తనిఖీలో బయటపడ్డాయి. ఆహార పదార్థాలకు సరైన లేబులింగ్‌లు లేకుండా గడువు ముగిసిన, పురుగులు పట్టిన పదార్థాలను అధికారులు గుర్తించారు.
ఫుడ్ హ్యాండ్లర్లు సరైన వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడంపై అధికారుల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమానం ఉన్న 22 ఆహార నమూనాలను సేకరించారు. కుళ్లిపోయిన కూరగాయలు, పురుగులు పట్టిన ఆహార పదార్థాలను పారబోశారు. నిబంధనల ఉల్లంఘనలపై 23 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు ఇచ్చారు. ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా 3 సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు సస్పెండ్ చేశారు. వెంటనే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని మహేంద్ర మీల్స్, బిర్యానీ అండ్ కర్రీ పాయింట్‌లో, కరీంనగర్ బావ్‌పేటలోని శ్రీ బాలాజీ మ్యాజిక్ మిఠాయి దుకాణంలో, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ దీ౦-65లోని చాచా ఫ్యామిలీ దాబాలో అధికారులు తనిఖీలు చేశారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!

మొదటి పేజీ తరువాయి



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది. దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు మిగతా సభ్య దేశాల అగ్రనేతలు హాజరవుతుండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే, తమకు కూడా ఎలాంటి అధికారిక సమాచారం లేదని అంతకుముందు చైనా విదేశాంగ శాఖ చెప్పడంతో.. అసలు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు వస్తారా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. చివరకు జిన్‌పింగ్ పర్యటనపై చైనా అధికారిక మీడియా నుంచి ప్రకటన వెలువడడం గమనార్హం.
భారత్-చైనా మధ్య దశాబ్దాలుగా సరిహద్దు విభేదాలు నెలకొన్నాయి. 1962లో యుద్ధం వీటికి నాంది పలికిందని చెప్పొచ్చు. 2020లో గల్వాన్ ఘర్షణతో అవి మరింత తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ మధ్యకాలంలో రెండు దేశాలు కాస్త పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తోంది. గతేడాది షాంఘై సహకార సదస్సు కు ప్రధాని మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఈ బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# లంచ్‌కు ఆహ్వానించిన అమృతా ఫడణవీస్..
# జరాంగే ఏమన్నారంటే!



మరాఠా రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న మనోజ్ జరాంగే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 13వ రోజుకు చేరుకుంది. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు వైద్య నివేదికలు వెల్లడించాయి. ఈ క్రమంలో నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సతీమణి అమృతా ఫడణవీస్ మీడియాతో మాట్లాడుతూ.. మనోజ్ జరాంగేను సోదరుడిగా భావిస్తున్నానని, ఆయన్ను భోజనానికి తమ ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నానని అన్నారు.
సీఎం సతీమణి ఆహ్వానంపై జరాంగే స్పందించారు. ఆమె నివాసానికి వెళ్లేందుకు ఇది సరైన సమయం కాదన్నారు. ఓ సోదరిగా అభిమానంతో పిలిస్తే మాత్రం.. ఆమె ఆహ్వానాన్ని అంగీకరిస్తానని అన్నారు. అయితే, దీపావళి తర్వాత చేసుకునే 'భావ్‌బీజ్'కు తప్పకుండా వస్తానని అన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా మహారాష్ట్రలో ఈ పండగ చేసుకుంటారు. అయితే, రిజర్వేషన్ కోటా డిమాండ్లను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో చలో ముంబయి కార్యక్రమాన్ని చేపట్టి తీరతామని జరాంగే స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి సెప్టెంబర్ 12న కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు.
గతేడాది ఆగస్టు 29న ముంబయిలోని ఆజాద్ మైదానంలో జరాంగే ఐదు రోజుల నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో స్పందించిన ప్రభుత్వం.. కొన్ని డిమాండ్లను అంగీకరించడంతో ఉద్యమ నేత ఆందోళనలను విరమించారు. మిగిలిన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జాల్నా జిల్లాలో గత నెల 29న జరాంగే మరోసారి నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్యం క్షీణిస్తుండడంతో పలువురు మంత్రులు ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఐవీ ఫ్లూయిడ్స్ తీసుకునేందుకు ఉద్యమ నేత

## అప్పుడే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది: డొనాల్డ్ ట్రంప్

మొదటి పేజీ తరువాయి

హార్మూజ్ జలసంధి లో ఇరాన్ సరికొత్త నిబంధనలను ప్రకటించింది. అమెరికా మద్దతుతో జలసంధిలో అసురక్షిత మార్గంలో ప్రయాణిస్తోన్న నౌకలను ఆంక్షల జాబితాలో చేరుస్తామని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇటీవల యూఎస్ నౌకలు, 8 ట్యాంకర్లపైన ఐఆర్‌జీసీ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. మరోవైపు, అమెరికా కూడా టెహ్రాన్ నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. దాంతో జోర్డాన్‌లోని యూఎస్ స్థావరంపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ ఘటనలతో హార్మూజ్‌లో నౌకల రవాణా మరోసారి ప్రమాదంలో పడింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది. కాగా.. తాము ఇరాన్‌తో చర్చలు కోరుకోవడం లేదని, అయితే ఒప్పందం కుదుర్చుకునే అంశాన్ని మాత్రం పక్కనపెట్టలేదని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.
జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ దాడులు చేయడంతో పలు సైనిక విమానాలు దెబ్బతిన్నాయని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఏ-10 థండర్‌బోల్ట్ విమానంతో పాటు ఎనిమిది ఎఫ్-15 యుద్ధ విమానాలు స్వల్పంగా దెబ్బతిన్నాయని పేర్కొంది. ఇరాన్ దాడులను అడ్డుకునేందుకు అమెరికా బలగాలు 30 పాట్రియాట్ క్షిపణులను మోహరించాయని తెలిపింది. జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్ నుంచి పదుల సంఖ్యలో అమెరికా విమానాలు పనిచేస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో ఈ బేస్ కీలకంగా మారింది.

## 15వేల మంది పోలీసులు..
## 500 సీసీటీవీలు.. బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రత

బ్రిక్స్ సదస్సు కు దేశ రాజధాని దిల్లీ నగరం సిద్ధమైంది. ఈనెల 12, 13 తేదీల్లో ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాల అగ్రనేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో దిల్లీ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో భారీగా భద్రతను పెంచారు. దాదాపు 15 వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. 200 పారామిలటరీ కంపెనీలను మోహరించారు. విమానాశ్రయాలు, హోటళ్లు, భారత్ మండపం సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నేతలు బస చేసే పలు హోటళ్ల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు.నగరంలోని కీలక ప్రాంతాల్లో నిఘా కోసం సుమారు 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వైమానిక ముప్పును ఎదుర్కొనేందుకు యాంటీ డ్రోన్ వ్యవస్థలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా పలువురు దేశాధినేతలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ కాన్వాయ్‌ల రాకపోకల కోసం అధికారులు ప్రత్యేక మార్గాలను ఖరారు చేశారు.

## ఆ వీడియోలను నమ్మి మోసపోవద్దు
## - ప్రియాంక కార్యాలయం హెచ్చరిక



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. కృత్రిమ మేధ సాయంతో ఆమె ఫొటోలు, వాయిస్‌ను ఉపయోగించి ఈ వీడియోలు రూపొందించారు. పలు సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రియంకా స్వయంగా చెబుతున్నట్లు ఆ వీడియోల్లో ఉంది. ఈ నకిలీ వీడియోలపై ఆమె కార్యాలయం స్పందించింది. వాటిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించింది. ఏఐతో రూపొందించిన ఆ వీడియోలు మోసపూరితమైనవని స్పష్టం చేసింది. వాటిలోని లింకులపై క్లిక్ చేయొద్దని, ఎలాంటి పెట్టుబడులు పెట్టొద్దని సూచించింది. ఇలాంటి పోస్టులు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేసి.. బ్లాక్ చేయాలని కోరింది.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

మొదటి పేజీ తరువాయి

నగరంలో గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చెరువుల్లో నిమజ్జనాలకు హైడ్రా వ్యతిరేకం కాదన్నారు. సోషల్ మీడియాలో హైడ్రా పై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు."కేంద్రం నోటిఫై చేసిన 4-5 చెరువుల్లోనే గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు ఉన్నాయి. అమీన్‌పూర్, కాప్రా చెరువుల్లో ఆంక్షలు విధించారు. దేశంలో ప్రప్రథమంగా అమీన్‌పూర్ చెరువును బయోడైవర్సిటీగా, నేచురల్ వెట్‌ల్యాండ్ కింద కాప్రా చెరువును కేంద్రం గుర్తించింది. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఆంక్షలు లేవు. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం. పీవోపీ విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి చెరువు వద్ద ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నాం"అని రంగనాథ్ తెలిపారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం..
## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన..
## ఈ 48 గంటలు కీలకం!

మొదటి పేజీ తరువాయి

బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశాతో పాటు ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లోనూ ఈ ప్రభావం ఉండే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అలాగే ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో సముద్రం అలజడిగా ఉంటూ తీవ్ర అలజడిగా మారే అవకాశం ఉందని తెలిపింది.
దీంతో రానున్న 48 గంటల్లో మత్స్యకారులు ఉత్తర, మధ్య బంగాళాఖాతంలోకి.. అలాగే బంగ్లాదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల వెంబడి సముద్రంలోకి వెళ్లొద్దని ఐఎండీ సూచించింది. ఈ అల్పపీడన ప్రభావం ప్రస్తుతానికి రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలపై పెద్దగా ఉండదని పేర్కొంది. తెలంగాణవార్తలు
ముఖ్యంగా ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులు వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## పనులు ఇంత ఆలస్యంగానా..?
## సిగ్గుగా ఉంది: గడ్కరీ



ముంబయి-గోవా జాతీయ రహదారి విస్తరణ పనులు ఏళ్లుగా సాగుతుండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఇంత ఆలస్యం కావడం సిగ్గుగా ఉందన్నారు. అందుకే రహదారి ప్రారంభోత్సవానికి హాజరుకాబోనన్నారు. గోవాలోని పోర్వోరిమ్‌లో ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబయి-గోవా రహదారి నిర్మాణంలో పలువురు కాంట్రాక్టర్లు విఫలమయ్యారని చెప్పారు. బాధ్యతగా పనిచేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు అధికారులను సస్పెండ్ చేసి రికార్డు సృష్టించాలనుకుంటున్నానని పేర్కొన్నారు. ఆ దిశగా కఠిన చర్యలకు వెనకాడబోనని తెలిపారు. ప్రాజెక్టు విషయంలో ఇంతకాలం ఎదురుచూసినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత విభాగాలు రెట్టింపు వేగంతో పనిచేయాలని సూచించారు. ఈ విస్తరణ పనులు 2016లోనే పూర్తికావాల్సి ఉంది. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వంటి కారణాలతో గడువులు పలుమార్లు దాటిపోయాయి. ప్రస్తుతం పనులు 93-94 శాతం పూర్తయ్యాయని గడ్కరీ తెలిపారు. అక్టోబరులో పనులను స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. రహదారి పనుల్లో నాణ్యతపై రాజీ ఉండకూడదని ఆదేశించారు.

# ఫ్లోటింగ్ సోలార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**●రిజర్వాయర్లపై ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు**
**●డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:**
రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సౌర, ఫ్లోటింగ్ సోలార్, ఇతర సంప్రదాయేతర ఇంధన వనరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని అన్నారు. దీనిపై త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామని ఆయన చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి సోదాహరణంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కొమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

**అదనపు వ్యయమే ప్రధాన సవాల్:**
సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు అధిక వ్యయం అవుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినప్పటికీ అందులో కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పారు. ప్రధానంగా దేశీయంగా తయారైన పరికరాలనే ఉపయోగించాలనే కేంద్ర నిబంధనల కారణంగా మెగావాట్‌కు సుమారు రూ.1.30 కోట్ల వరకు అదనపు భారం పడుతోందని వివరించారు. కేంద్రం విధించిన నిబంధనలను సడలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులపై పెట్టుబడిదారుల్లో మరింత ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం



పెట్టుబడిదారులను ప్రోత్సహించి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోందని ఆయన శాసనసభకు చెప్పారు.

**18,543 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్:**
రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని శాసనసభకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సుమారు 15 వేల మెగావాట్లు ఉండగా.. సెప్టెంబర్ 9 నాటికి అది 19వేల మెగావాట్లకు చేరిందని చెప్పారు. పారిశ్రామిక వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వంటి కారణాలతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని ఆయన వివరించారు. పెరుగుతున్న డిమాండ్ రాష్ట్ర అభివృద్ధికి సానుకూల సంకేతమే అయినప్పటికీ, అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

**ఏడాదికి రూ.19 వేల కోట్ల సబ్సిడీ:**
వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీ భరిస్తోందని డిప్యూటీ సీఎం చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా సుమారు 55 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. దీనికి మరో రూ.5 వేల కోట్ల వరకు వ్యయం అవుతోందన్నారు. మొత్తంగా దాదాపు రూ.19 వేల కోట్లను ఏటా విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని ఆయన సభకు తెలిపారు. భవిష్యత్తులో ఈ భారాన్ని తగ్గించుకుంటూనే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం సోలార్ విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నామన్నారు.

80 గ్రామాల సోలరైజేషన్:
అమ్రాబాద్ గిరిజన ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సుమారు 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, మైక్రో గ్రిడ్ ద్వారా విద్యుత్ వినియోగించే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామన్నారు.

**ఇందిరా సౌర గిరి జల వికాసం:**
గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పేరుతో పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అవకాశం ఉన్నచోట సోలరైజేషన్, ఫ్లోటింగ్ సోలార్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, ముఖ్యంగా మంథని నియోజకవర్గంలోని కాటారం, మహాముత్తారం వంటి ప్రాంతాల్లోనూ అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

**సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలి:**
రైతులు, ప్రజలు సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన పెంచుకోవాలని భట్టి విక్రమార్క కోరారు. తమ తమ గ్రామాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రైతులకు ఎమ్మెల్యేలు అవగాహన కల్పించాలని సూచించారు. పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యేలకు ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థినీల రక్షణలో ప్రభుత్వాలు విఫలం

**●ఢిల్లీలో కదిలే బస్సులో విద్యార్థినిపై అత్యాచార ఘటన దీనికి నిదర్శనం**
**●జెన్-జీ ఉద్యమంలో విద్యార్థినులు, యువత కీలక పాత్ర**
**●మహిళా విద్యకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి: ఎస్ఎఫ్ఐ**

**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు10:**
విద్యార్థినీలకు రక్షణ కల్పించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు శిల్ప, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీలో కదులుతున్న బస్సులో విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని వారు అన్నారు.
భువనగిరి వెన్నెల కళాశాలలో ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ స్టూడెంట్స్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతుల్లో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ప్రారంభ సూచికగా స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలను ప్రతిబింబించే ఎస్ఎఫ్ఐ జెండాను రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.మమత ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు శిల్ప, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి మల్లేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.అనురాధ, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కిరణ్, రాష్ట్ర గర్ల్స్ కో-కన్వీనర్లు కృపాజార్జీ, దీపిక, జ్ఞాప్నిక, డి.సుమ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ దేశంలో మహిళలు, విద్యార్థినులపై హింస, వేధింపులు, వివక్ష కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు విద్యా సంస్థల్లో సురక్షితమైన




వాతావరణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.జెన్-జీ విద్యార్థి ఉద్యమాల్లో విద్యార్థినులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పోరాట స్ఫూర్తిని చాటారని ఆమె అన్నారు. తమ విద్యా హక్కులు, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం కోసం యువత ముందుకు వస్తున్న తరుణంలో వారి స్వరాన్ని అణిచివేయకుండా ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ విద్యా విధానం--2020 వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆమె విమర్శించారు. విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వైపు నడిపించడం వల్ల పేద కుటుంబాలపై ఆర్థిక భారం పెరిగి గర్ల్స్ డ్రాప్‌అవుట్స్ మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు.టి.నాగరాజు మాట్లాడుతూ మహిళలకు సమాన విద్యా అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థినుల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లను బలోపేతం చేయాలని, భద్రతా చర్యలు పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.మహిళలను సమాన హక్కులు కలిగిన పౌరులుగా చూడకుండా వివక్షను కొనసాగిస్తూ వారిని ఇంటికే, వంటగదికే పరిమితం చేయాలనే ఆలోచనలను ప్రోత్సహించే శక్తుల పట్ల విద్యార్థి లోకం అప్రమత్తంగా ఉండాలని అన్నారు.



మహిళా విద్య, ఉపాధి, స్వేచ్ఛ, సమానత్వం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.మమత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. విద్యార్థినులపై వేధింపులు, భద్రతా సమస్యలు, హాస్టళ్ల సమస్యలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజులు, విద్యా సౌకర్యాల కొరత వంటి సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి మల్లేశం, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ విద్యార్థినులు తమ సమస్యలను వ్యక్తిగత సమస్యలుగా కాకుండా సామాజిక సమస్యలుగా భావించి సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యార్థినుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి దీపిక,సుమ, కృప జార్జ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, లావుడియ రాజు, జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఇందు రాణి, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్, పట్టల ఉదయ్ , ధరావత్ జగన్, జిల్లా కమిటీ సభ్యులు నాయకులు కార్తీక్,ప్రసన్న,నరేందర్, నేహాల్ ,గర్ల్స్ కో-కన్వీనర్లు,, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారం పోయినా అహంకారం వీడలేదు

**●నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలి**
**●సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:**
ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఫామ్ హౌస్ లో కేసీఆర్ అధ్యక్షతన సభను సజావుగా జరగకుండా కుట్ర చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారని
సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారన్నారు. నిరసన తెలిపేందుకు ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పి కొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసినందుకు సభ్యుల్ని సీఎం అభినందించారు. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టడం జరిగిందని, సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలని సీఎం సూచించారు. సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని, ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్ లో రాజకీయంగా రాణించలేరన్నారు. అసెంబ్లీలో సెంట్రల్ హాల్ ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు



పేరు పెట్టుకున్నామని వివరించారు.
సభలో నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలని, అసెంబ్లీ జరిగినన్ని రోజులు సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగి కాంగ్రెస్కు నష్టం చేకూర్చాలని చూస్తున్నారని.. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మా రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని సీఎం అన్నారు. పోలీస్ సిబ్బందిలో కేటీఆర్ కు రేవంత్ రెడ్డి కనిపించినట్టున్నారని.. అంత ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారని మండిపడ్డారు. దేశానికి మనం చేసిన జనగణన రోల్ మోడల్ అని, ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత సీఎం అన్నారు. తెలంగాణ నమూనాను జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని, ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతీ ఒక్కరు ఈ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలని సూచించారు. మీ ప్రతీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందన్నారు. మీ వ్యక్తిగత పనితీరు మీ గెలుపు ఓటములను ప్రభావితం చేస్తుందని, సర్ అంశాన్ని సీరియస్ గా పరిగణనలోకి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# అన్న గారికి నమస్కారములు

**●మట్టి వినాయకులనే ప్రతిష్టిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం**
**●రాజయోగి డాక్టర్ చిక్కా దేవదాసు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 10,**
వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూనే మన పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రపంచ పర్యావరణ, ప్రకృతి ప్రేమికుడు, శతాధిక అవార్డుల గ్రహీత రాజయోగి డాక్టర్ చిక్కా దేవదాసు దేశ ప్రజలకు పిలుపునిచ్చారు



సాంప్రదాయంగా మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను పూజించడం మన భారతీయ సంస్కృతిలో భాగమని మట్టి వినాయక విగ్రహాలు నీటిలో సులభంగా కలిసి పోవడంతో చెరువులు, కుంటలు, నదులు కలుషితం కాకుండా ఉంటాయని చిక్కా దేవదాసు అన్నారు
ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులకు, జలచరాలకు హాని కలిగే అవకాశం ఉందని అందువల్ల ప్రజలు మట్టి వినాయక విగ్రహాలని కొనుగోలు చేసి పూజించాలని, రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నివారించాలని చిక్కా దేవదాసు కోరారు. వినాయకుని పండుగ రోజులలో ఇండ్లలో మండపాల వద్ద ప్రతి ఒక్కరూ చేనేత కండువాలు చేనేత దుస్తులు ధరించాలని,
పర్యావరణహితమైన సహజ రంగులతో అలంకరించిన మట్టి విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక కళాకారులు, ఉత్పత్తి కులాలకు కూడా ఉపాధి లభిస్తుందని చిక్కా దేవదాసు తెలిపారు.
మట్టి వినాయకుడు మన సంప్రదాయానికి ప్రతీక, పర్యావరణానికి రక్షణ కవచం కనుక భక్తి పేరుతో ప్రకృతికి హాని చేయకుండా, భక్తితో పాటు బాధ్యతను కూడా పాటించాలని మన చెరువులు, కుంటలు, నదులను పరిశుభ్రంగా ఉంచి భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని చిక్కా దేవదాసు అన్నారు

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత...

**● ఆశ్రమ పాఠశాలల పండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై పరిశీలన**
**●శాసనమండలిలో సభ్యుల పలు ప్రశ్నలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమాధానం**




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:**
రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్లు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన అంశాలపై సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలంగాణ శాసనమండలిలో గురువారం శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.
శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న , తక్కెళ్ళపల్లి రవీందర్ రావ్, సత్యం నెలికంటి లేవనెత్తిన అంశాలకు మంత్రి అడ్లూరి వివరాలను వెల్లడించారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల పరిస్థితి గురించి ప్రస్తావిస్తూ.. 2025--26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591.62 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడానికి వారి నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయన్న అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, అటువంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దీంతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలకు సంబంధించిన తదుపరి ప్రశ్న ఉత్పన్నం కాదని తెలిపారు.
అలాగే ఎమ్మెల్సీలు శ్రీపాల్ రెడ్డి లేవనెత్తిన అంశం....పండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్ , ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్లు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశంపై మంత్రి అడ్లూరి.. సమాధానం ఇస్తూ, ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్రతిపాదనపై సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది అంశాలపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి అడ్లూరి తెలిపారు.

## చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న సిపిఐ మండల నాయకులు

**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు10:**
యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కేంద్రంలోని బస్టాండ్ చౌరాస్తా వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు నివాళులు అర్పించిన సిపిఐ మండల కార్యదర్శి అన్నేమైన వెంకటేశం.వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నిర్భయంగా పోరాడి దేశానికి స్ఫూర్తిగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ. ఉద్యమం నేత చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో కృష్ణ, ప్రవీణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.



# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

- ●రూ.5 లక్షల ఉచిత సాయం దేశంలో ఎక్కడా లేదు.. తెలంగాణలోనే అమలు
- ●రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు
- ●ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు
- ●ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:**
పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30--40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150--200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు.

**డ్రాలో పారదర్శకత.. అనర్హులకు చోటు లేదు**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. రూ.5 లక్షలు ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు.

**8 లక్షల ఇళ్లకు సుమారు రూ.40 వేల కోట్ల భారం**

మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**చిన్న లోపాలతో ఆగిన 3,200 ఇళ్లకు పరిష్కారం**

మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.
పాత ప్రభుత్వ స్థలాల్లో నెల రోజుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

**రూ.310--320 సిమెంట్ బ్యాగ్ రూ.230కే**

ఇంటి నిర్మాణంలో ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.310--320 ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే పేదలకు అందించేలా ఒప్పందం పూర్తి చేశామని, త్వరలో ఈ విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**రాష్ట్రంలో 59 వేల గుడిసెలకు రెండో విడతలో ప్రాధాన్యత**

దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తిచేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**అసంపూర్తి 2బీఎఖలకు రూ.750 కోట్ల చెల్లింపులు**

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 2బీఎఖ ఇళ్లను పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వదిలిన 2బీఎఖ ఇళ్లకు సుమారు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని చెప్పారు.

**అసంపూర్తి ఇళ్లకు రెండో విడతలో ప్రత్యేక అవకాశం**

గతంలో వివిధ కారణాలతో సొంత డబ్బులతో ఫౌండేషన్, గోడలు లేదా స్లాబ్ వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు కూడా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు.

**డ్వాక్రా మహిళలకు రూ.లక్ష అడ్వాన్స్**

ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని, డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులైన పేదలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేదలు గుడిసెల నుంచి స్లాబ్ వేసిన ఇందిరమ్మ ఇళ్లలోకి మారేలా ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలని కోరారు.

## దళితులు తాకిన ఫామ్ హౌస్ నేల మలినమైందని పసుపు నీళ్లుజల్లించిన కెసిఆర్ దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

●ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెల్లరమేష్ మాదిగ డిమాండ్ చేశారు.



**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి,సెప్టెంబరు10:**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో ప్రతిపక్ష పార్టీ అయినా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అండ్ ఎమ్మెల్సీలు నల్ల టీ షర్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్తున్న వారిని అడ్డుకున్న పోలీస్ వాళ్లపై దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగి దౌర్జన్యానికి పాల్పడుతూ అదే సమయంలో శాసనసభాపతి అయిన స్పీకర్ గడ్డం ప్రసాద్ని కూడా అనుచిత వ్యాఖ్యలు చేసిన టిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును బర్తరఫు చేయాలని తెలంగాణ వ్యాప్తంగా దళితులు రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమం చేస్తున్న సందర్భంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని మాల మాదిగలు ఏకమై కేసీఆర్ ఫామ్ ముట్టడించి మీరు ఆ సంఘటనకు బాధ్యత వహించాలని నిరసన కార్యక్రమం చేసిన సందర్భంలో చేసి వెళ్లిపోయిన తర్వాత దళితులు తాకిన ఫామ్ హౌస్ ప్రాంగణం అపవిత్రమైందని పసుపు నీళ్లతోశుద్ధి చేయించడం అంటరానితనాన్ని పెంచి పోషించడమేనని వారు విమర్శించారు.ఎందుకంటే కెసిఆర్ కు దళితులపై ఉన్నది ప్రేమ కాదు వివక్షానీ అర్థమైతుంది అన్నారు. ఎందుకంటే తెలంగాణ వస్తే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చేయలేదు. దళితులను వంచించి మోసం చేయటానికి ఇది నిదర్శనమని వారన్నారు.ఇప్పటికైనా కేసీఆర్ పత్రిక ముఖంగా దళితులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేదంటే జిల్లావ్యాప్తంగా మాల మాదిగలు ఏకమై దిష్టిబొమ్మలు తగలపెడతామని మరొకసారి కెసిఆర్ ఫామ్ హౌస్ ను వేలాది మందితో ముట్టడిస్తామని తెలియజేశారు.

## దళితులు నడిచిన నేలను బి.ఆర్.ఎస్ శుద్ధి చేయడం దారుణం: ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి..



**ఉస్మానియా యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :**
మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ వద్దకు దళితులు వచ్చారనే కారణంతో బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడాన్ని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఘటనను నిరసిస్తూ గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ దళితులను చిన్నచూపు చూడటం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య సమాజంలో సరికాదన్నారు. ఇలాంటి చర్యలు సామాజిక సమానత్వానికి విరుద్ధమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కేటీఆర్, హరీష్ రావు ను ఓడిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలం ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కొత్తపల్లి తిరుపతి తెలిపారు. ప్రజా ప్రతినిధుల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. తక్షణమే బీఆర్ఎస్ నాయకులు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్, రాజేందర్, చరణ్, స్వామి అరుణ్, ఆకాష్, కుశాల్, ఆంజనేయులు, వెంకటేష్, అఖిల్, రాజు, సాయి, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంస్కృత లెక్చరర్ బాలకృష్ణ జన్మదిన వేడుకలు

స్నేహితుల మధ్య ఆనందోత్సాహంగా వేడుక





**హైదారాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 10:**
సంస్కృత లెక్చరర్ బాలకృష్ణ జన్మదిన వేడుకలు శ్రీనన్న నివాసంలో స్నేహితుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలకృష్ణ కేక్ కట్ చేయగా, స్నేహితులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ వేడుకలో సాయి పోలీస్, రాజా, ప్రేమ్, షాయ్ కిరణ్ తదితర స్నేహితులు పాల్గొని బాలకృష్ణకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాలకృష్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ వృత్తి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.స్నేహితుల సందడి, ఆత్మీయ శుభాకాంక్షల మధ్య జన్మదిన వేడుక ఆనందోత్సాహంగా సాగింది.

## ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

సర్పంచ్ కొంపల్లి సైదులు ఆధ్వర్యంలో నివాళులు



**నల్లగొండ, అమ్మనబోలు, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 10:**
చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొంపల్లి సైదులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.
ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు బసాని శంకరయ్య, శివ, శ్రావణ్, హరీష్, సతీష్, సాయి, మల్లేష్, సాయి కుమార్, సాయి ప్రసాద్, శ్రీనివాస్, బసాని మల్లేష్ (జానయ్య కుమారుడు), పైళ్ల నవీన్ తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

## మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాల కళాశాలను సందర్శించిన కలెక్టర్ అనురాగ్ జయంతి





**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి,సెప్టెంబరు10:**
విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడంతోపాటు మంచి విద్యను కూడా అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం మోటకొండూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు.ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని అందులో ఇంటర్మీడియట్ మరియు పాఠశాల స్థాయిలో చదువుతున్న విద్యార్థుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విధులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారా అనే విషయాలను కూడా పరిశీలించారు.స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, నిల్వ ఉన్న ఆహార పదార్థాల నాణ్యత, వాటి గడువు తేదీలను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా తెలుసుకొని, గురువారం రోజు అందించనున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో చదివే విద్యార్థిని ఈశ్వ జాతీయ స్థాయి సైయిలింగ్ క్రీడల్లో పాల్గొన్న విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆమెతో ప్రత్యేకంగా మాట్లాడారు. సైయిలింగ్ క్రీడను ఎంచుకోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో సైయిలింగ్‌లో పాల్గొనాలనే తన ఆకాంక్షను విద్యార్థిని కలెక్టర్‌కు తెలిపారు.ఇందుకు అవసరమైన సహాయం, సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డి సి ఓ మాధవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేదాసి మోహన్ మాదిగ

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు



**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు10:**
ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగకి,నూతనంగా రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులు అయిన కేదాసి మోహన్ మాదిగకి గురువారం రోజు హైదరాబాద్ ఒక ప్రైవేట్ హోటల్లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర నాయకులు బోట్ల శంకర్ మాదిగ,మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్ మాదిగ.

## ఈనెల 17 న పబ్లిక్ గార్డెన్ లోలి ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:**
ఈనెల 17 వతేదీన నాంపల్లి లోని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పీ సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17 న ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం పబ్లిక్ గార్డెన్ కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపంవద్ద, పబ్లిక్ గార్డెన్ లో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు , చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకుగానూ ఈనెల 15 న పూర్తి డ్రెస్ రిహార్సల్స్ ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయి మంది స్వయం సహాయక మహిళలతో పాటు రెండు వేల మంది హాజరవుతారని పేర్కొన్నారు.

# కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి చేస్తున్నాము

- మంత్రి తుమ్మల
- ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయల దిగుమతులు తగ్గించి.. తెలంగాణ కూరగాయలు ఇతర రాష్ట్రాలకు వెళ్లేలా కార్యాచరణ
- వానాకాలంలో లక్ష ఎకరాలు, రబీలో మరో లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక
- కూరగాయల సాగుకు రూ.125 కోట్లకుపైగా వివిధ రాయితీలు, సేద్య సదుపాయాల కోసం కేటాయింపులు
- శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి తుమ్మల సమాధానం

హైదరాబాద్ సెప్టెంబర్ 10 ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
తెలంగాణలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తిరిగి పెంచడంతో పాటు రైతులకు ఆధునిక సాంకేతికత, నాణ్యమైన ఇన్‌పుట్స్, సాగునీటి సదుపాయాలు, శిక్షణ, ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్, మార్కెటింగ్ వంటి అన్ని రంగాలను సమన్వయం చేసి సమగ్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ రోజు శాసనసభలో తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగుపై కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, యశశ్వినీ రెడ్డి, తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

కూరగాయల సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యం...
గతంలో తెలంగాణలో సుమారు 3 లక్షల ఎకరాల్లో కూరగాయల సాగు జరిగితే, ప్రస్తుతం అది సుమారు లక్ష ఎకరాలకు తగ్గిపోయిందని మంత్రి తెలిపారు. ఫలితంగా 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఈ వానాకాలంలో 51000 సాధారణ విస్తీర్ణానికి గాను 72,583 ఎకరాలలో కూరగాయల సాగు జరిగిందని తెలిపారు.

కూరగాయల ధరలు ప్రధానంగా డిమాండ్, సరఫరాపై ఆధారపడి ఉండటం వల్ల మార్కెట్లో ధరల్లో తరచూ హెచ్చుతగ్గులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులకు లాభదాయకమైన పంటల వైపు వెళ్లేలా ప్రోత్సహించడంతో పాటు, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

సాగుకు అవసరమైన సదుపాయాలపై భారీగా రాయితీలు...
కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నారు, మల్చింగ్, షేడ్‌నెట్, శాశ్వత పందిళ్లు, బిందు మరియు తుంపర సేద్యం వంటి సదుపాయాలను రైతులకు రాయితీలపై అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూరగాయల నారు, మల్చింగ్, షేడ్‌నెట్ కోసం రూ.20 కోట్లు, శాశ్వత పందిళ్ల కోసం రూ.8 కోట్లు, బిందు సేద్యం కోసం రూ.97 కోట్లుకేటాయించినట్లు వెల్లడించారు.
అన్ని పంటలకు విస్తీర్ణం ఆధారంగానే రైతు భరోసా అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

రెండు లక్షల ఎకరాల్లో కూరగాయల సాగుకు కార్యాచరణ
రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తక్షణమే పెంచేందుకు ప్రస్తుత వానాకాలంలో సుమారు లక్ష ఎకరాల్లో, తదుపరి రబీ సీజన్‌లో మరో లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు.
తెలంగాణకు అవసరమైన కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండా చేసి, తెలంగాణలో పండించిన కూరగాయలు ఇతర రాష్ట్రాలకు వెళ్లే స్థాయికి ఉత్పత్తిని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం.. సమతుల్య రాయితీల విధానం...
రైతులు అధిక దిగుబడి, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు వెళ్లేలా వ్యవసాయ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కొన్ని పంటలు, కొన్ని పద్ధతులకే రాయితీలు పరిమితం కావడం వల్ల వ్యవసాయంలో సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు.
రైతులకు అవసరమైన పంటలు, భూమి సంరక్షణ, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే విధంగా రాయితీల విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి సేద్యాన్ని కూడా పెంచి పోషించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకొని రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

ఎరువుల విధానంపై కేంద్రంతో సమన్వయం అవసరం..
యూరియా వినియోగం పెరగడం వల్ల పురుగు మందుల వినియోగం కూడా పెరుగుతోందని మంత్రి తెలిపారు. యూరియా వినియోగాన్ని సమతుల్యం చేసేలా, భూమిని సంరక్షించే ఎరువులకు ప్రాధాన్యతనిచ్చే విధంగా సబ్సిడీ విధానాన్ని మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు.
ఈ అంశంపై ప్రధానమంత్రి, కేంద్ర వ్యవసాయ మంత్రితో పలుమార్లు చర్చించినట్లు వెల్లడించారు. దక్షిణ భారత రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో ఈ నెల 18న సమావేశం నిర్వహించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు.

పామాయిల్‌తో పాటు అంతర పంటలకు ప్రోత్సాహం...
తెలంగాణలో గతంలో పరిమితంగా ఉన్న ఆయిల్‌పామ్ సాగును ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించినట్లు మంత్రి తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల్లో అల్లం, కంది, కూరగాయలు వంటి వివిధ అంతర పంటలను సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు.
ఆయిల్‌పామ్‌తో పాటు అంతర పంటల ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా వ్యవసాయ విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు.

ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్, ఎగుమతులకు ప్రాధాన్యం...
కూరగాయల ఉత్పత్తి పెంచడంతో పాటు వాటి నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం అందించిన పథకాలను రాష్ట్రం తగిన స్థాయిలో వినియోగించుకోలేకపోయిందని పేర్కొంటూ, గత రెండు మూడు సంవత్సరాలుగా కేంద్రం నుంచి వచ్చే నిధులకు రాష్ట్ర వాటాను జోడించి 60:40 నిష్పత్తిలో వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాయితీలు అందిస్తున్నామని చెప్పారు.

కోహెడలో అంతర్జాతీయ స్థాయి మార్కెట్...
కోహెడ మార్కెట్‌కు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 170 ఎకరాల్లో భారీ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వివిధ రకాల పంటలను నిల్వ చేసుకోవడం, మార్కెటింగ్ చేయడం, ఎగుమతులు చేపట్టడం వంటి సదుపాయాలతో ఈ మార్కెట్‌ను రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.
హైదరాబాద్‌లోని పహాడిషరీఫ్, గుడిమల్కాపూర్ తదితర మార్కెట్ల సమస్యలను పరిష్కరించేందుకు డైరెక్టర్ మార్కెటింగ్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో నాణ్యతకు పెద్దపీట...
వ్యవసాయ విద్యలో నాణ్యతను పెంచేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 11 ప్రైవేట్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలను తనిఖీ చేయగా, ప్రమాణాలు పాటించని 6 కళాశాలల అనుబంధాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. మిగిలిన నాలుగు కళాశాలలను కూడా మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తోందని, నిర్దేశిత ప్రమాణాలు పాటించకపోతే వాటిపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
మౌలిక వసతులు, ప్రయోగాత్మక పొలాలు, ప్రయోగశాలలు, బోధన సదుపాయాలు, అధ్యాపకులు, విద్యార్థుల వసతి తదితర అంశాల్లో నిర్దేశిత ప్రమాణాలను పాటించేలా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్నల్ మానిటరింగ్ కమిటీ, టెక్నికల్ ఇన్‌స్పెక్షన్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డిమాండ్ లేని కోర్సులను ఆధునీకరణకు అనుగుణంగా మార్పు...
వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సులకు ప్రస్తుతం తగిన విద్యార్థుల డిమాండ్ లేదని మంత్రి తెలిపారు. గతంలో 750 సీట్లు ఉండగా వాటిని 450 సీట్లకు తగ్గించినప్పటికీ, కొన్ని కళాశాలల్లో 8 నుంచి 12 మంది విద్యార్థులు మాత్రమే చేరుతున్న పరిస్థితి ఉందని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కళాశాలల్లో అధ్యాపకులు, మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నందున, ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించేలా కళాశాలలను పునర్వ్యవస్థీకరిస్తామని తెలిపారు.
ప్రభుత్వ ఆధీనంలోని నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా ఆధునీకరించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

ఆధునిక వ్యవసాయం కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి కొత్త దిశ
మారుతున్న వాతావరణ పరిస్థితులు, డిజిటల్ అగ్రికల్చర్, సాంకేతిక ఆవిష్కరణలకు అనుగుణంగా వ్యవసాయ విద్య, పరిశోధనను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం గతంలో 37వ ర్యాంకులో ఉండగా, గత రెండు మూడు సంవత్సరాల్లో తీసుకున్న చర్యలతో ప్రస్తుతం 19వ ర్యాంకుకు చేరిందని తెలిపారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయాన్ని మొదటి ర్యాంకుకు తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.
అవసరమైన టీచింగ్ స్టాఫ్, మౌలిక వసతులను సమకూర్చడంతో పాటు ఆధునిక వ్యవసాయ పరిశోధన, డిజిటల్ వ్యవసాయం, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

కొత్త వ్యవసాయ కళాశాలల ఏర్పాటు.. సీట్ల పెంపు...
వ్యవసాయ విద్యకు పెరుగుతున్న అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి, వికారాబాద్ జిల్లాల్లో వ్యవసాయ కళాశాలలకు అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో వ్యవసాయ విద్యలో సుమారు 1,100 సీట్ల సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం దాన్ని 2,000 సీట్లకు పెంచగలిగామని వెల్లడించారు.
ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అవసరమైన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా వ్యవసాయ కళాశాలలను ఆధునీకరిస్తామని మంత్రి తెలిపారు.
వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా తెలంగాణలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం వ్యవసాయ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, ప్రయోగశాలలు, ప్రయోగాత్మక పొలాలు, బోధనా సిబ్బంది, పరిశోధనా సదుపాయాలను బలోపేతం చేస్తామని తెలిపారు.
ప్రస్తుతం ఉన్న కళాశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, వాటికి అనుగుణంగా సిబ్బందిని నియమించి నాణ్యమైన, ఆధునిక వ్యవసాయ విద్యను అందించేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# ఫ్లోటింగ్ సోలార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రిజర్వాయర్లపై ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సౌర, ఫ్లోటింగ్ సోలార్, ఇతర సంప్రదాయేతర ఇంధన వనరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని అన్నారు. దీనిపై త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామని ఆయన చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి సోదాహరణంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కొమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

## అదనపు వ్యయమే ప్రధాన సవాల్:

సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు అధిక వ్యయం అవుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినప్పటికీ అందులో కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పారు. ప్రధానంగా దేశీయంగా తయారైన పరికరాలనే ఉపయోగించాలనే కేంద్ర నిబంధనల కారణంగా మెగావాట్‌కు సుమారు రూ.1.30 కోట్ల వరకు అదనపు భారం పడుతోందని వివరించారు. కేంద్రం విధించిన నిబంధనలను సడలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులపై పెట్టుబడిదారుల్లో మరింత ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులను ప్రోత్సహించి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోందని ఆయన శాసనసభకు చెప్పారు.

## 18,543 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్:

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని శాసనసభకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సుమారు 15 వేల మెగావాట్లు ఉండగా.. సెప్టెంబర్ 9 నాటికి అది 19వేల మెగావాట్లకు చేరిందని చెప్పారు. పారిశ్రామిక వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వంటి కారణాలతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని ఆయన వివరించారు. పెరుగుతున్న డిమాండ్ రాష్ట్ర అభివృద్ధికి సానుకూల సంకేతమే అయినప్పటికీ, అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

ఏడాదికి రూ.19 వేల కోట్ల సబ్సిడీ:
వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీ భరిస్తోందని డిప్యూటీ సీఎం చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా సుమారు 55 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. దీనికి మరో రూ.5 వేల కోట్ల వరకు వ్యయం అవుతోందన్నారు. మొత్తంగా దాదాపు రూ.19 వేల కోట్లను ఏటా విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని ఆయన సభకు తెలిపారు. భవిష్యత్తులో ఈ భారాన్ని తగ్గించుకుంటూనే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం సోలార్ విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నామన్నారు.

## 80 గ్రామాల సోలరైజేషన్:

అమ్రాబాద్ గిరిజన ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సుమారు 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, మైక్రో గ్రిడ్ ద్వారా విద్యుత్ వినియోగించే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామన్నారు.

## ఇందిరా సౌర గిరి జల వికాసం:

గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పేరుతో పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అవకాశం ఉన్నచోట సోలరైజేషన్, ఫ్లోటింగ్ సోలార్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, ముఖ్యంగా మంథని నియోజకవర్గంలోని కాటారం, మహాముత్తారం వంటి ప్రాంతాల్లోనూ అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

## సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలి:

రైతులు, ప్రజలు సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన పెంచుకోవాలని భట్టి విక్రమార్క కోరారు. తమ తమ గ్రామాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రైతులకు ఎమ్మెల్యేలు అవగాహన కల్పించాలని సూచించారు. పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యేలకు ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ పరిరక్షణే ధ్యేయం..
# ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ





ప్రతి ఇంటా మట్టి గణపతి ప్రతిష్ఠించాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని అన్ని డివిజన్ల ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలను అందజేస్తున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.
గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్ మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తూ, ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా నగరంలోని మొత్తం 66 డివిజన్ల ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే సుమారు 15,000 మట్టి గణపతి ప్రతిమలను తెప్పించినట్లు వెల్లడించారు. ఒక్కో డివిజన్‌కు సుమారు 250 చొప్పున విగ్రహాలను కేటాయించి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు.
ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉందని మేయర్ అన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు జలవనరుల పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని తెలిపారు.
"భక్తి ఉండాలి.. పర్యావరణ హితం కూడా ఉండాలి. ప్రతి ఇంటా మట్టి గణపతిని ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణకు నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని, వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుంది

- క్రీడలు విజయాలను సులభతరం చేస్తాయిలి
- ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలి వ్యక్తిత్వ వికాసానికై పాటుపడాలిలి
- క్రీడలు ఒత్తిడి నుండి ఉపశమనం కల్పిస్తుంది. ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలి మరియు ప్రతిభను చాటడంతో పాటు క్రీడాసక్తిని పెంపొందించుకోవాలిలి
- వివిధ రకాల క్రీడలలో పాల్గొనడం ద్వారా అనుభవం వస్తుంది ఒ సోదర భావం పెరుగుతుంది

కరీంనగర్ ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
క్రీడలు విద్యార్థుల జీవితంలో చాలా కీలకంగా వ్యవహరిస్తాయని మరియు వివిధ రకాల క్రీడలలో పాల్గొనడం ద్వారా కలిగేటువంటి ఉపశమనం చాలా గొప్పనైనదని అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు మల్లారెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో 70వ ఎస్జీఎఫ్ కొత్తపల్లి (ఎ) మండల స్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ ఒ అథ్లెటిక్స్ అండర్ 14 ఒ 17 బాలికల పోటీల ప్రారంభోత్సవానికి మండల విద్యాశాఖ అధికారి తుమ్మ ఆనందంతో కలిసి వారు ముఖ్య అతిథిగా మాట్లాడారు.
ఈ సందర్భంగా విద్యార్థులందరూ వివిధ రకాల క్రీడలను వివిధ సమయాల్లో పాల్గొని వారి యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించాలని మరియు పోటీతత్వాన్ని సైతం పెంపొందించుకోవాలని వారు సూచించారు.
నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికి క్రీడలు అనివార్యం అయినవని మరియు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ప్రత్యేక గుర్తింపు సైతం సమాజంలో సొంతం చేసుకోవచ్చని వారు చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడారంగానికి చాలా ప్రాముఖ్యత ఇస్తుందని మరియు క్రీడారంగాన్ని ప్రోత్సహించడంలో అల్ఫోర్స్ అగ్రగామిగా ఉంటుందని వారు చెప్పారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి అల్ఫోర్స్ విద్యార్థులకు టోర్నమెంట్లు సైతం నిర్వహిస్తున్నదని మరియు కావలసినటువంటి కోచింగ్ ఎపిస్తుందని వారు చెప్పారు
విశిష్ట అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి ఆనందం మాట్లాడుతూ క్రీడలలో పాల్గొన్నవారు చదువులో కూడా హుషారుగా చదివి అగ్రగామిగా ఉంటారని చెప్పారు. క్రీడల యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు నిపుణులైన కోచ్లే శిక్షణ ఇప్పించడం చాలా గొప్ప విషయమని మరియు వివిధ స్థాయిలలో నిర్వహింపబడుతున్నటువంటి వివిధ రకాల పోటీలకు చేయూతనివ్వడం జరుగుతుందని వారు చెప్పారు
ఇందులో భాగంగా నేడు పాఠశాలలో 70వ ఎస్జీఎఫ్ కొత్తపల్లి(ఎ) మండల స్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ అథ్లెటిక్ టోర్నమెంట్ అండర్ 14 ఒ 17 బాలికల టోర్నమెంట్ ప్రారంభించడం జరిగిందని వారు చెప్పారు.
ఈ టోర్నమెంట్లో నేడు సుమారు 400 మంది క్రీడాకారులు వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల నుండి విచ్చేసారని వారు చెప్పారు. అదేవిధంగా విచ్చేసిన వారందరికీ "అల్ఫోర్స్" భోజన వసతిని కల్పించడం చాలా హర్షించదగ్గ విషయమని మరియు విద్యా సంస్థల వారికి

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శుక్రవారం సెప్టెంబర్ 11,2026
www.trinetnews.com

# అసెంబ్లీకి వెళ్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పై లైంగిక వేధింపుల కేసు పెట్టారు

తలసాని కృష్ణ యాదవ్ మాజీ మంత్రి




ప్రముఖ పత్రికలో బిఆర్ఎస్ నేతల పై లైంగిక వేధింపుల కేసు అంటూ ప్రచురితమైంది.1994 లోనే నేను , ౹ా రమణ ఎమ్మెల్యేలుగా ఉన్నాము.అసెంబ్లీకి వెళ్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పై లైంగిక వేధింపుల కేసు పెట్టారన్నారు రెండు తెలుగు రాష్ట్రాల్లో 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వాళ్ళల్లో నాతో పాటు నలుగురు ఐదుగురే ఉంటారు.మొదటి సారి చూస్తున్న అసెంబ్లీకి వెళ్తున్న వారి పై ఇలాంటి కేసులు పెట్టడం....!తాతలు , ముత్తాతలు సంపాదించిన భూములను 22–ూా జాబితాలో పెట్టారు.వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యం చెందింది.సెప్టెంబర్ 07 తారీఖు రోజు అసెంబ్లీ గేటు బయట అంతమంది పోలీసులను పెట్టాల్సిన అవసరం ఏముంది....?తోపులాటలో బిఆర్ఎస్ శాసన సభ్యులకు దెబ్బలు తగిలాయి.మహిళ శాసన సభ్యులైనసబితా ఇంద్రారెడ్డి సునీతా లక్ష్మారెడ్డి గొంతు , చీర పట్టుకొని లాగారు.అసెంబ్లీ బయట స్పీకర్ పరిధి కానే కాదు... తాతా మధు అనని మాటలను అసెంబ్లీ బయట జరిగిన విషయాన్ని భారతదేశ దేశ రాజకీయాల్లో రెడ్డి స్పీకర్, బీసీ స్పీకర్, దళిత స్పీకర్ అన్నట్లు చరిత్రలోనే లేదు.గడ్డం ప్రసాద్ కుమార్ అంటే బిఆర్ఎస్ పార్టీ గౌరవం.దళిత స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ ను బిఆర్ఎస్ చూడలేదు.గడ్డం ప్రసాద్ కుమార్ దళితుడని ఈ రాష్ట్ర ప్రజలకు సగం మందికి తెలియదు.ముఖ్యమంత్రి , మంత్రులు పదే పదే దళితుడు దళితుడు అనబట్టే గడ్డం ప్రసాద్ కుమార్ దళితుడని తెలిసింది.దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ వెంటనే ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేస్తున్నాము.దళితుల పై ప్రేమ చూపిస్తున్న రేవంత్ రెడ్డి గడ్డం ప్రసాద్ కుమార్ ను ముఖ్యమంత్రిని చేసి నిరూపించుకోవాలి.ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం దగ్గర దళితులు డప్పు కొడితే శుద్ధి చేశామని ముఖ్యమంత్రి అంటున్నాడు.తూముకుంట నర్సారెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి దళితుడా....!శాసన సభలో ఫేక్ అకౌంట్ పేరును ముఖ్యమంత్రి ప్రస్తావనకు తెచ్చారు.సంధ్యా రావు అనే ఫేక్ అకౌంట్ నడిపించేదే కాంగ్రెస్ సోషల్ మీడియా.125 అడుగుల డా బిఆర్ అంబేద్కర్ విగ్రహం పెట్టాలని ఎవరు కోరలేదు.ట్యాంక్ బండ్ పక్కన 125 అడుగుల డా బిఆర్ అంబేద్కర్ విగ్రహం కేసీఆర్ పెట్టారు.భారతదేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయంకు డా" బిఆర్ అంబేద్కర్ పేరు పెట్టాము.తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కేసీఆర్ కోరుకున్నారు.కేసీఆర్ చనిపోవాలని కాంగ్రెస్ శాసన సభ్యుడు అంటే శాసన సభలో చర్చ పెట్టరా.....!కేసీఆర్ చనిపోవాలని మాట్లాడిన కాంగ్రెస్ శాసన సభ్యుడు సస్పెండ్ చేయాలి.అసెంబ్లీకి వెళ్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పై లైంగిక వేధింపుల కేసు పెడితే .... మేము అసెంబ్లీ కి వచ్చేది ఎలా.....?తెలంగాణ పుట్టిన దగ్గర నుంచి గ్రామాల్లో వరుసలు పెట్టుకొని పిలుచుకునే సంస్కారం తెలంగాణలో ఉంటుంది.కాంగ్రెస్ నేతల బజారు భాషతో తెలంగాణ సంస్కారాన్ని నాశనం చేస్తున్నారు.బిఆర్ఎస్ పార్టీలో లేని శాసన సభ్యుడుని ఫ్యానల్ స్పీకర్ గా ఎన్నుకున్నారు.ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ ను అనని మాటలను స్పీకర్ కు ఆపాదించారు.స్పీకర్ ను తాతా మధు అన్నట్లు నిరూపిస్తే బిఆర్ఎస్ శాసన సభ్యులు మొత్తం క్షమాపణ చెప్పేందుకు సిద్ధం..... మాకు ఎటువంటి భేషజాలు లేవు.బిఆర్ఎస్ మహిళలను ముందు పెట్టి తోసేశామని ...కాంగ్రెస్ నేతలు దారుణంగా మాట్లాడుతున్నారు.ముషీరాబాద్ బ్రిడ్జి, ౧×మీా, సైఫాబాద్ స్టీల్ బ్రిడ్జి బిఆర్ఎస్ హయంలోనే మొత్తం పనులు పూర్తి అయ్యాయి.పూర్తి అయిన వాటికి రిబ్బన్ కట్ చేస్తూ రేవంత్ రెడ్డి అకౌంట్ లో వేసుకుంటున్నాడు.కాంగ్రెస్ ఇంట్లో పంచాయతీ బిఆర్ఎస్ పై రుద్దుతున్నారు.చీ= ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి నేను రాజకీయాల్లో ఉన్నాను.ఇలాంటి రాజకీయాలు నేను ఎన్నడు చూడలేదు.గడ్డం ప్రసాద్ కుమార్ ను ముఖ్యమంత్రి చేయాలని రాహుల్ గాంధీని వేడుకుంటున్న.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చెయ్యాల్సిందే.హామీలు అమలు చేసేదాక బిఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుంది.ఈ సమావేశంలో బిఆర్ఎస్ విప్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, దీజ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్ గౌడ్, కురవ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఇష్టారీతిన దుబారా ఖర్చులు

**ఓ ఇంజనీర్ కాంట్రాక్టర్ అవతారం**
**రినోవేషన్ పేరిట కోట్లాది రూపాలతో**
**కార్పొరేట్ స్థాయిలో చాంబర్స్ ఏర్పాటు**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:
జీహెచ్ఎంసీ లో ఉద్యోగులు, కార్మికులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు, కాంట్రాక్టర్లకు అభివృద్ధి. మెయింటెనెన్స్ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. అనవసర ఖర్చులను కంట్రోల్ చేయడం లేదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీలోకి డిప్యుటేషన్లపై వచ్చే అధికారులకు కోట్లాది రూపాయలు వెచ్చించి, కార్పొరేట్ స్థాయిలో ఛాంబర్లను ఏర్పాటు చేయడం విమర్శలకు దారితీస్తోంది. బిల్డింగ్ మెయింటెనెన్స్ విభాగంలో దశాబ్దాలుగా తిష్ట వేసిన ఓ ఇంజినీర్ తరుచూ ప్రతిపాదనలు తయారు చేస్తున్నా, ఉన్నతాధికారులు ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్న సమయంలో గుడ్డిగా మంజూరీలిస్తున్నట్లు సమాచారం. పనులు కూడా సదరు ఇంజినీర్ బినామీలే చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ రకంగా ప్రతి ఏటా సుమారు రూ.10 కోట్ల వరకు రెనోవేషన్ పేరిట ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఆర్థిక సంక్షోభం సమయంలో ఈ వ్యయభారం అవసరమా అని కొందరు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏడాది పొడువునా ప్రధాన కార్యాలయం లో ఎక్కడో ఓ చోట రెనోవేషన్ పనులను మంజూరు చేయించుకుంటూ పనులు కొనసాగిస్తున్న ఓ ఇంజినీర్ కోట్లాది రూపాయల అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కనిష్టంగా మూడేళ్ళు, గరిష్టంగా నాలుగేళ్ల పాటు డిప్యుటేషన్పై విధులు నిర్వర్తించే వివిధ విభాగాధిపతులు, అదనపు కమిషనర్ల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి, అధికారులకు నచ్చిన విధంగా చాంబర్ల రెనోవేషన్ పనులను కొనసాగిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం మూడో అంతస్తులోని ఇద్దరు అదనపు కమిషనర్ల ఛాంబర్లను రెనోవేట్ చేసిన అధికారులు.. ఇప్పుడు రెండో అంతస్తులోని ఫైనాన్షియల్ అడ్వైజర్ ఛాంబర్ను కూడా కోట్లాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఛాంబర్ల రెనోవేషన్ పనులు పూర్తయ్యే దశలో అధికారుల వాస్తు సెంటిమెంట్లో అదనంగా మరిన్ని పనులు




కూడా చేపట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఫైనాన్షియల్ అడ్వైజర్ ఛాంబర్ను బిల్లుల కోసం కాంట్రాక్టర్లు మినహా ఉన్నతాధికారులు గానీ, సందర్శకులు గానీ ఎవరూ పెద్దగా సందర్శించరు. సందర్శకులు ఎక్కువగా రాకపోకలు సాగించే చీఫ్ మెడికల్ ఆఫీసర్, అదనపు కమిషనర్ (శానిటేషన్), 6వ అంతస్తులోని మెయింటెనెన్స్, ప్రాజెక్టుల విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్ల ఛాంబర్లు దశాబ్దాలుగా అరకొర వసతుల మధ్యనే కొనసాగుతున్నాయి. 5వ అంతస్తులోని చీఫ్ ఇంజినీర్ ఆఫీస్ కార్పొరేట్ లుక్ ఉండగా, 6వ అంతస్తులోని ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏ ఛాంబర్ను కూడా ఇప్పటి వరకు రినోవేట్ చేయకపోవడంతో పాత లుక్ నే దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ప్రస్తుతం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏ యూనియన్ కూడా గుర్తింపు చెల్లుబాటు లో లేకపోయినా, యూనియన్లు అడగడమే ఆలస్యం యూనియన్ల ఆఫీస్ రెనోవేషన్కు కూడా అధికారులు మంజూరీలివ్వడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్లో రెనోవేషన్ పనులు చేపట్టిన కొద్ది నెలలకే వర్షపు నీరు లీకేజీ అయ్యేలా నాసిరకం పనులు చేపట్టిన సదరు ఇంజినీర్ రూపకల్పన చేసిన ప్రతి ప్రతిపాదనకు అధికారులు గుడ్డిగా మంజూరీ ఇవ్వడం వెనకా అసలు ఆంతర్యమేంటన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు మూడు, నాలుగు, రెండో అంతస్తుల్లో రెనొవేట్ చేసిన ఛాంబర్ల అప్పట్లో అదనపు కమిషనర్లుగా విధులు నిర్వహించిన క్యాడర్, నాన్ క్యాడర్ ఆఫీ సర్లకు ఛాంబర్ల రెనొవేషన్ కలిసి రాలేదు. అదనపు కమిషనర్గా విధులు నిర్వహించిన అనురాగ్ జయంతి ఛాంబర్ నాలుగో అంత స్తులో ఉండేది. కార్పొరేట్ స్థాయిలో ఆయన ఛాంబర్ను రెనోవేట్ చేయగానే ఆయనకు జీహెచ్ఎంసీ నుంచి బదిలీ అయింది. అలాగే గతంలో మూడో అంతస్తులోని అదనపు కమిషనర్ (ఫైనాన్స్)గా విధులు నిర్వర్తించిన గీ తారాధిక ఛాంబర్ను కూడా రెనోవేట్ చేసిన వెంటనే ఆమెను మరో విభాగానికి బదిలీ అయ్యారు. కొన్ని రోజులు ఏ విభాగాన్ని కేటాయించకుండా పక్కన బెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. జీహెచ్ఎంసీ విభజించక ముందు ఇదే మూడో అంతస్తులోని అదనపు కమిషనర్ ఛాంబర్ను వినియోగించిన, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సృజన కూడా కొద్ది రోజులు మాత్రమే ఈ చాంబర్ లోవిధులు నిర్వర్తించి, ఫిబ్రవరి 11 నుంచి సైబరాబాద్ కమిషనర్ గా నియమితులయ్యారు.

**స్క్రాప్ను కూడా వదలరా?**

పొడువునా జరిగే ఛాంబర్ల రెనోవేషన్తో ఖరీదైన ఫర్నిచర్ , కంప్యూటర్లు, ఇతర సామాగ్రి స్క్రాప్ మారుతున్నది. నిబంధనల ప్రకారం ఈ స్క్రాప్కు టెండర్ల ప్రక్రియ చేపట్టి, డిస్పోజ్ చేయాల్సి ఉండగా, మెయింటెనెన్స్ విభాగం అధికారులు ఎలాంటి టెండర్ల ప్రక్రియ చేపట్టకుండా గడిచిన కొద్ది రోజుల నుంచి స్క్రాప్ను తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ స్క్రాప్ తరలింపునకు సంబంధించి మెయింటెనెన్స్ విభాగానికి చెందిన ఓ ఇంజినీర్ను ప్రశ్నించగా, అంతా రూల్స్ ప్రకారమే జరుగుతున్నదని, టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టామని సమాధానమిస్తున్నారు. కానీ, అందుకు సంబంధించి ఎలాంటి పత్రాలు గానీ, డాక్యుమెంట్లను గానీ సమర్పించడం లేదు. దాదాపు నెల రోజుల నుంచి సదరు ఇంజినీర్ అంతా రూల్స్ ప్రకారమే జరుగుతుందంటూ సమాధానం చెబుతూ దాటవేయడం గమనార్హం.

# తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం మరో చారిత్రక నిర్ణయం --- సికింద్రాబాద్ (ఘట్‌కేసర్)--కాజీపేట రైల్వే బహుళ ట్రాకింగ్‌కు ఆమోదం

**డాక్టర్ కే లక్ష్మణ్ ఎంపీ రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సమావేశంలో తెలంగాణకు అత్యంత ప్రయోజనకరమైన సికింద్రాబాద్ (ఘట్‌కేసర్)--కాజీపేట బహుళ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం లభించడం పట్ల హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను
సెప్టెంబర్ 9, 2026న కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎనిమిది రైల్వే మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.20,804 కోట్లతో ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించిన ఐదు కీలక ప్రాజెక్టులకు రూ.10,021 కోట్ల పెట్టుబడితో ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు మొత్తం 540 కిలోమీటర్ల రైల్వే మార్గాన్ని అభివృద్ధి చేయనున్నాయి
సికింద్రాబాద్--ఘట్‌కేసర్--కాజీపేట మార్గం తెలంగాణ రైల్వే వ్యవస్థకు జీవనాడి వంటిది. ఈ మార్గంలో బహుళ ట్రాకింగ్ చేపట్టడం ద్వారా రైళ్ల రద్దీ తగ్గి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయి. సరుకు రవాణా వేగవంతమై, తెలంగాణ పరిశ్రమలు, రైతులు, వ్యాపారులు, యువతకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుంది.
ఈ నిర్ణయం ప్రధాని మోదీ గారి వికసిత భారత్--వికసిత తెలంగాణ సంకల్పానికి నిదర్శనం. పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రూపొందించిన ఈ ప్రాజెక్టులు రహదారి, రైలు, పరిశ్రమలు, మార్కెట్ల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయి. రవాణా వ్యయం తగ్గి, సరఫరా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుంది.
తెలంగాణకు ప్రయోజనాలు
- సికింద్రాబాద్--కాజీపేట రైల్వే కారిడార్‌లో రద్దీ తగ్గి రైళ్ల సమయపాలన, సేవా విశ్వసనీయత మెరుగుపడుతుంది.
- ప్రయాణికుల రైళ్లతోపాటు బొగ్గు, సిమెంట్, ఇనుము--ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైళ్లు, ఆహార ధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు అదనపు సామర్థ్యం ఏర్పడుతుంది.
- తెలంగాణలోని పరిశ్రమలకు సరుకు రవాణా సౌలభ్యం పెరిగి లాజిస్టిక్స్ వ్యయం తగ్గే అవకాశం ఉంటుంది.
- నిర్మాణ దశలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయి; అనుబంధ సేవారంగాలకు కూడా ఉత్సాహం లభిస్తుంది.
- యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, భువనగిరి కోట వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలకు చేరువ మెరుగవుతుంది.
- పర్యావరణహితమైన రైలు రవాణా విస్తరణతో ఇంధన వినియోగం, కాలుష్య ఉద్గారాలు తగ్గేందుకు తోడ్పడుతుంది.
"ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ నిర్ణయం స్పష్టమైన నిదర్శనం. సికింద్రాబాద్--కాజీపేట బహుళ ట్రాకింగ్ ప్రాజెక్టు కేవలం రైల్వే పనికాదు; ఇది తెలంగాణ ఆర్థిక పురోగతి, పారిశ్రామిక విస్తరణ, యువత ఉపాధి, పర్యాటకాభివృద్ధికి బలమైన పునాది."
"కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా, భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులతో రాష్ట్రాల అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తోంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రైల్వే కనెక్టివిటీని మరింత పటిష్ఠం చేస్తున్నందుకు ప్రధాని గారికి, కేంద్ర రైల్వే శాఖకు కృతజ్ఞతలు."
"2029--30 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్రాజెక్టు తెలంగాణను జాతీయ సరకు రవాణా, పారిశ్రామిక కారిడార్లతో మరింత బలంగా అనుసంధానిస్తుంది.

# గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ వినియోగం పెరుగుదల --౹+హ్రాణజూ పరిధిలో అధిక లోడ్ నమోదు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :




౹+హ్రాణజూ పరిధిలో విద్యుత్ వినియోగం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గణనీయంగా పెరిగినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి.
2026-27 ఆర్థిక సంవత్సరంలో 09.09.2026 న సాయంత్రం 4:11 గంటలకు ౹+హ్రాణజూ పరిధిలో 11,792 మెగావాట్ల (వీజె) గరిష్ట డిమాండ్ నమోదు కాగా, గత సంవత్సరం ఇదే రోజున (09.09.2025) సాయంత్రం 4:00 గంటలకు నమోదైన 10,528 మెగావాట్లతో పోలిస్తే 1,264 మెగావాట్ల పెరుగుదల చోటుచేసుకుంది. ఇది 14.23 శాతం అధికం.
అలాగే, +నవీజ పరిధిలో 09.09.2026 న సాయంత్రం 6:46 గంటలకు 4,782 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైంది. గత సంవత్సరం ఇదే రోజున నమోదైన 3,678 మెగావాట్లతో పోలిస్తే 1,104 మెగావాట్ల పెరుగుదల నమోదైంది.
రాష్ట్రవ్యాప్తంగా (౧+ క్ఫ్వ) 09.09.2026 న ఉదయం 10:44 గంటలకు 19,543 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదవగా, గత సంవత్సరం ఇదే రోజున నమోదైన 15,585 మెగావాట్లతో పోలిస్తే 3,958 మెగావాట్ల పెరుగుదల కనిపించింది. ఇది 21.83 శాతం అధికం.
విద్యుత్ డిమాండ్ నిరంతరం పెరుగుతున్నప్పటికీ, వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ౹+హ్రాణజూ అన్ని స్థాయిలలో ముందస్తు చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు. విద్యుత్ వ్యవస్థ బలోపేతం, ఉపకేంద్రాల సామర్థ్య పెంపు, కొత్త ఫీడర్లు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి చర్యల ద్వారా పెరుగుతున్న డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# తెలంగాణ శాసన మండలి: హైదరాబాద్

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత...**
**ఆశ్రమ పాఠశాలల పండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై పరిశీలన**
**శాసనమండలిలో సభ్యుల పలు ప్రశ్నలకు**
**జవాబిచ్చిన ... షెడ్యూలు కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్లు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన అంశాలపై సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలంగాణ శాసనమండలిలో గురువారం శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.
శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న , తక్కెళ్ళపల్లి రవీందర్ రావ్ , సత్యం నెలికంటి లేవనెత్తిన అంశాలకు మంత్రి అడ్లూరి వివరాలను వెల్లడించారు.
విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల పరిస్థితి గురించి ప్రస్తావిస్తూ.. 2025--26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591.62 కోట్లుగా ఉన్నాయని తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడానికి వారి నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయన్న అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, అటువంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దీంతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలకు సంబంధించిన తదుపరి ప్రశ్న ఉత్పన్నం కాదని తెలిపారు.అలాగే ఎమ్మెల్సీలు శ్రీపాల్ రెడ్డి లేవనెత్తిన అంశం....పండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్ , ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్లు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశంపై మంత్రి అడ్లూరి.. సమాధానం ఇస్తూ...ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్రతిపాదనపై సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.విద్యార్థుల సంక్షేమం, విద్యా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది అంశాలపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి అడ్లూరి తెలిపారు.

# పెట్రోలియం రంగంలో పర్యావరణ సమస్యలపై చర్చ

**●ఎంపీ వద్దిరాజు ఢిల్లీలో జరిగిన స్థాయీ సంఘం సమావేశంలో పెట్రోలియం రంగంలో పర్యావరణ సమస్యలపై చర్చించారు**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
ప్రపంచంలో ప్రాథమిక ఇంధనాన్ని వినియోగించే దేశాలలో అమెరికా, చైనాల తర్వాత మన భారత్ 3వ స్థానంలో ఉన్నదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం గురువారం ఢిల్లీలో సమావేశమై "పెట్రోలియం రంగంలో పర్యావరణ సమస్యలు"అనే అంశంపై చర్చించింది.స్థాయీ సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, ప్రపంచ దేశాలు పునరుత్పాదక ఇంధనం, గ్యాస్ వంటి ఇతర స్వచ్ఛమైన ఇంధన వనరుల వినియోగం వైపు,మార్పిడి దిశగా సాగుతున్నాయన్నారు.ఇంధన మిశ్రమంలో సహజవాయువు వాటాను 2030 సంవత్సరం వరకు 6 నుంచి 15 శాతానికి పెంచాలనే లక్ష్యానికి అనుగుణంగా పైప్ లైన్లు, రిఫైనరీ వినియోగ పెంపుదల, గ్యాస్ పంపిణీ నెట్ వర్క్ విస్తరణతో సహా మౌలిక సదుపాయాల కల్పన మరింతగా జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ రవిచంద్ర అన్నారు. అలాగే,సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలతో భాగస్వామ్యం కలిగి ఉంటే మంచిదని సూచించారు.సురక్షితమైన,విశ్వసనీయమైన,సరసమైన ఇంధన సరఫరాలు నిర్ధారిస్తూనే 2035-46 సంవత్సరాల నాటికి నెట్ జీరో సాధించడానికి సరైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఎంపీ వద్దిరాజు సలహాలిచ్చారు.సమావేశంలో పెట్రోలియం, సహజవాయువు శాఖ ఉన్నతాధికారులు,ప్రభుత్వరంగ చమురు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతీయ వేదికపై జలమండలి ఉత్తమ విధానాల ప్రజెంటేషన్

**●పట్టణ నీటి భద్రతలో హైదరాబాద్ అనుభవాలను వివరించిన జేఎండీ మయాంక్ మిట్టల్**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :




పట్టణ నీటి భద్రత, మురుగునీటి నిర్వహణలో హైదరాబాద్ జలమండలి అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు, పరివర్తనాత్మక కార్యక్రమాలను జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్ జాతీయ వేదికపై వివరించారు.సెప్టెంబర్ 9న ముంబైలోని బాంబే ప్రదర్శన కేంద్రంలో ప్రారంభమైన ఐఎఫ్ఏటీ ఇండియా--2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. "ఒకే నీరు -- ఒకే నగరం -- ఒకే భవిష్యత్తు: వికసిత్ భారత్--2047 కోసం పట్టణ నీటి నిర్వహణకు పునరాలోచన" అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఇందులో భాగంగా జరిగిన "మెగా సిటీస్ వాటర్ అలయన్స్: పట్టణ నీటి భద్రతలో భారతీయ నాయకత్వం" ప్రత్యేక సమావేశంలో జలమండలి ఉత్తమ విధానాలు, వినూత్న కార్యక్రమాలపై మయాంక్ మిట్టల్ వివరణాత్మక సమర్పణ చేశారు.హైదరాబాద్ నగరంలో నీటి భద్రత, తాగునీటి సరఫరా బలోపేతం, మురుగునీటి శుద్ధి, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం, భూగర్భ జలాలు--వర్షపు నీటి సంరక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ కోసం జలమండలి చేపడుతున్న చర్యలను వివరించారు.కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మెగా సిటీస్ వాటర్ అలయన్స్ (మహానగరాల జల కూటమి) లో హైదరాబాద్ సభ్య నగరంగా ఉంది. సుస్థిర నీటి నిర్వహణ, తాగునీటి సరఫరా విస్తరణ, మురుగునీటి శుద్ధి సామర్థ్యం పెంపు, వాతావరణ మార్పులను తట్టుకునే పట్టణ నీటి వ్యవస్థల అభివృద్ధి ఈ కూటమి ప్రధాన లక్ష్యాలు.

# మల్కాజిగిరిలో ట్రైనీస్ తో గంజాయి తనిఖీలు..

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
మల్కాజ్గిరి డిటిఎఫ్ టీం, మల్కాజిగిరి ఎస్ హెచ్ ఓ టీం, తో పాటు ట్రైన్ ఏఈఎస్ లు సాయిరాం, నివేదిత, సాయి, శ్రీకాంత్, సిద్దిక్, ముస్తఫా. ఇతర సిబ్బంది కలిసి ఫతేనగర్ ఏరియాలో గంజాయి అమ్మకాలు జరిపే కుటుంబాల ఇల్లాలు నాకాబంది నిర్వహించి సోదాలు చేపట్టారు. 50 మంది గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లుగా ఫతేనగర్ లో గుర్తించారు.
వారిపై నిఘా పెట్టడం ఎలా దాడులు చేయాలని విషయంలో శిక్షణార్థుల కోసం ఈ నాకాబంది నిర్వహించినట్లు మల్కాజ్గిరి అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్ రావు తెలిపారు.

# కొత్త కోచ్ కోసం సీఎస్కే వేట.. ధోని రెండు కండీషన్లు?

సుదీర్ఘకాలంగా చెన్నై సూపర్ కింగ్స్‌కు (జూఖ) ప్రధాన కోచ్‌గా సేవలు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ వైదొలిగి దాదాపు రెండు నెలలైంది. ఇంకా కొత్త కోచ్ ఎవరనేదానిపై సీఎస్కే ప్రకటన చేయలేదు. ఫలానా వ్యక్తి అంటూ పలువురి పేర్లు చర్చలోకి వస్తున్నాయి తప్పితే అధికారికంగా మాత్రం వెల్లడికాలేదు. వచ్చే వారంలోనే సీఎస్కే ఓ నిర్ణయానికి రానుందని ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఎంఎస్ ధోని మేనేజ్‌మెంట్ ముందు రెండు కండీషన్లు పెట్టినట్లు సమాచారం.

ఒకటి: ప్రధాన కోచ్‌గా రాబోయే వ్యక్తి భారత్‌కు చెందిన వారే అయి ఉండాలి. అలాగే, సపోర్ట్ స్టాఫ్‌ని కూడా ఇక్కడి నుంచే తీసుకోవాలనేది ధోని (మీా ఐష్ట్రశీఅఱ) మొదటి షరతు. ఇప్పటివరకు ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ న్యూజిలాండ్ ప్లేయర్. మరోవైపు, అతడికి బదులు ప్రధాన కోచ్ ఛాన్స్ ఆసీస్ మాజీ క్రికెటర్ మైక్ హస్సీకి వస్తుందని చాలా మంది భావించారు. ఇప్పుడు ధోని షరతు అతడికి ఇబ్బందిగా మారినట్లే. హస్సీ గత కొన్నేళ్లుగా సీఎస్కేకు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్నాడు.

రెండోది: కొత్తగా వచ్చే ప్రధాన కోచ్ కేవలం సీఎస్కేతోనే (జష్ట్రవఅఝఱ ాబజూవతీ ఖఱఅస్త్రం) పనిచేయాలి. గతంలో ఫ్లెమింగ్ జోహెన్నెస్‌బర్గ్ సూపర్ కింగ్స్, టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్లకూ కోచింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. ఇక నుంచి నూతన హెడ్ కోచ్ కేవలం సీఎస్కేతోనే పనిచేయాలి. ఫ్రాంచైజీకి ఉన్న మిగతా లీగుల్లోని జట్లతో సంబంధం లేదు.

అర్ధరాత్రి సమయంలో మ్యాచులా? యూఎస్ ఓపెన్ షెడ్యూల్‌పై తీవ్ర విమర్శలు

ధోని (మీా ఐష్ట్రశీఅఱ) షరతుల నేపథ్యంలో.. దిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ అయిన హేమంగ్ బదానీ పేరు తెరపైకి వచ్చింది. భారత్‌కు చెందిన బదానీకి కోచ్‌గా గొప్ప అనుభవం ఉంది. ప్రస్తుతం అతడు క్యాపిటల్స్ జట్టుకు కోచ్‌గా ఉన్నాడు. ధోనితోనూ మంచి సంబంధాలు ఉన్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. మరి సీఎస్కే మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.




# దులీప్ ట్రోఫీ విజేతగా ఈస్ట్ జోన్.. ఇషాన్, వైభవ్ సూర్యవంశీ డ్యాన్స్




చెన్నై: దులీప్ ట్రోఫీ 2026 (ఇబశ్రీవవజూ ుతీశీజూష్ట్రం)ని ఈస్ట్ జోన్ సొంతం చేసుకుంది. చెపాక్ స్టేడియం వేదికగా సౌత్ జోన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా అవతరించింది. 13 ఏళ్ల తర్వాత ఆ జట్టు ఈ టైటిల్‌ను నెగ్గడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ 708 పరుగులు చేయగా, సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌట్ అయింది. ఈస్ట్ జోన్‌కు ఫాలో ఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 212/5తో ఐదోరోజు, గురువారం ఆటను ఆరంభించిన ఇషాన్ కిషన్ టీమ్.. 388/7 పరుగులు చేసింది.

26 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో గురువారం బ్యాటింగ్ కొనసాగించిన కౌనైన్ ఖురేషి (116లి) శతకం సాధించాడు. మ్యాచ్‌లో ఫలితం అవకాశం లేకపోవడంతో డ్రాగా ముగిసినట్లు ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. మ్యాచ్ ముగిసిన అనంతరం ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ (ఝఱఎష్ట్ఘుజ ాబతీఝఝఅంష్ట్రఱ) మైదానంలో డ్యాన్స్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.

# జూనియర్ హాకీ ఆసియాకప్: పాక్ చిత్తు.. సెమీస్‌లో భారత్





పాకిస్థాన్‌ను టీమ్‌ఇండియా చిత్తు చేసింది. అదేంటి ఇప్పుడేం మ్యాచ్ అంటారా? జూనియర్ మహిళల హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు విజృంభించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో 19-0 తేడాతో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. చైనా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత ప్లేయర్ల ముందు పాక్ ఏమాత్రం నిలవలేకపోయింది. గ్రూప్ స్టేజ్‌లో జపాన్, మలేషియా, దక్షిణ కొరియాను ఓడించిన భారత్.. చైనాతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇప్పుడు క్వార్టర్స్‌లో పాక్‌పై గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. దక్షిణా కొరియా - మలేషియా పోరులో విజేతగా నిలిచే టీమ్‌తో భారత్ సెమీఫైనల్‌లో తలపడనుంది.

పోటీనే లేదు..

భారత యువ ప్లేయర్ పూజ ఏడో నిమిషంలోనే గోల్ కొట్టింది. ఆ తర్వాత సానికా మనె మరో రెండు గోల్స్ చేసింది. సగం సమయానికే భారత్ 10-0 లీడ్‌లోకి వెళ్లిపోయింది. మాలిక్ హ్యాట్రిక్‌తో రెండో అర్ధభాగంలోనూ టీమ్‌ఇండియాదే (ుఝఎ ×అుఝ) హవా. పాక్ నుంచి కనీస పోరాటం కూడా లేదు. ఆ జట్టు ఒక్కసారి కూడా గోల్ పోస్టు వైపు రాలేకపోయింది. ఇప్పటికే 2023, 2024 సీజన్లలో ఆసియా కప్‌ను గెలిచిన టీమ్‌ఇండియా.. హ్యాట్రిక్‌పై గురి పెట్టింది.

# యూఎస్ ఓపెన్‌లో బిలియనీర్ల ఫైట్ వైరల్






యూఎస్ ఓపెన్ 2026లో ఓ ఆసక్తికర పోరు జరిగింది. బిలియనీర్ల మధ్య చోటుచేసుకొన్న టెన్నిస్ సమరం ఒక్కసారిగా వార్తల్లోకెక్కింది. మహిళల క్వార్టర్స్ ఫైనల్‌లో జెస్సికా పెగులా - ఎమ్మా నవారో తలపడ్డారు. ఇందులో పెగులా విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లింది. అయితే, ఈ మ్యాచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ప్రపంచంలోనే అత్యంత ధనిక టెన్నిస్ ప్లేయర్లు ఒకే మ్యాచ్‌లో తలపడటం ఇదే మొదటిసారి. అమెరికా ప్లేయర్లైన వీరిద్దరూ బిలియనీర్ల కుటుంబాలకు చెందిన వారు కావడం విశేషం. దాదాపు రెండు కుటుంబాల సంయుక్త ఆస్తి విలువ 15 బిలియన్ డాలర్లకుపైగా ఉండొచ్చని అంచనా. ఇది టెన్నిస్ దిగ్గజాలు రోజర్ ఫెదరర్, జకోవిచ్, నాదల్ ఆస్తుల మొత్తాన్ని కలిపినా పెగులా - ఎమ్మా సంపదే ఎక్కువని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి.

**పెగులా కుటుంబం ఇలా..**

అమెరికా బిలియనీర్ టెర్రీ పెగులా కుమార్తె జెస్సికా పెగులా 2009లో టెన్నిస్‌లోకి అడుగుపెట్టింది. ఫుట్‌బాల్ జట్టు అయిన ఎన్‌ఎఫ్‌ఎల్ బఫెలో బిల్స్, ఐస్ హాకీ టీమ్ ఎన్‌హెచ్‌ఎల్ బఫెలో సాబ్రెస్ జట్లకు యజమాని టెర్రీ పెగులా. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం టెర్రీ పెగులా కుటుంబ ఆస్తి 11.8 బిలియన్ డాలర్లు ఉండొచ్చు. స్పోర్ట్స్‌లోనే కాకుండా.. ఎనర్జీ సెక్టార్‌లోనూ పెద్ద ఎత్తున పెట్టుబడులు ఉన్నాయి. జెస్సికా మాత్రం టెన్నిస్‌పై ప్రేమతో ఇటువైపు మళ్లింది. ప్రస్తుతం టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉంది.

**నవారో ఫ్యామిలీ..**

షెర్మన్ ఫైనాన్షియల్ గ్రూప్ వ్యవస్థాపకుడు బెన్ నవారో కుమార్తె ఎమ్మా నవారో. వీరి ఆస్తి 3.2 బిలియన్ డాలర్ల వరకూ ఉండొచ్చు. ఆర్థికపరమైన కార్యకలాపాలతోపాటు టెన్నిస్‌లోనూ ఈ కుటుంబం పెట్టుబడులు పెట్టింది. సిన్సినాటి ఓపెన్, ఛార్లెస్టన్ ఓపెన్ వంటి టెన్నిస్ టోర్నీల్లో భాగస్వామిగా ఉంది. ఇప్పటి వరకూ యూఎస్ ఓపెన్‌లో ఒక్కసారి మాత్రమే సెమీస్‌కు చేరుకుంది. ప్రస్తుతం ఆమె 27వ ర్యాంకులో కొనసాగుతోంది.

**పెగులానే విజేత..**

బిలియనీర్లు తలపడిన ఈ పోటీలో జెస్సికా పెగులానే విజయం వరించింది. తొలి సెట్‌ను ఎమ్మా గెలిచినా.. ఆ తర్వాత రెండు సెట్లను పెగులా సొంతం చేసుకుంది. దీంతో పెగులా 3-6, 6-4, 6-3 తేడాతో ఎమ్మాను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్‌లో సబలెంకాను పెగులా ఢీకొట్టనుంది. మరో సెమీస్‌లో కోకో గాఫ్ - రెబకినా తలపడతారు. ఈ రెండు మ్యాచులూ శుక్రవారం ఉదయం మొదలవుతాయి. ప్రస్తుతం మహిళల టెన్నిస్ ర్యాంకింగ్‌లో సబలెంకాను వెనక్కి నెట్టి రెబకినా అగ్రస్థానం దక్కించుకుంది.

# పెరిగిన ఎన్ఎండీసీ ఇనుప ఖనిజం ధర



**హైదరాబాద్:** ప్రభుత్వ రంగ గనుల సంస్థ ఎన్ఎండీసీ, అత్యధిక నాణ్యత కలిగిన ఇనుప ఖనిజం ధరలను సవరించింది. 65.5% ఐరన్ నాణ్యత ఉండే లంప్ ఓర్ ధరను టన్నుకు రూ.150 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో టన్ను లంప్ ఓర్ ధర రూ.5,400కి చేరింది. ఫైన్స్ రకం ధరల్లో మార్పు చేయకుండా రూ.4,500గా ఉంచింది.

## ధరల్లో మార్పు



**లంప్ ఓర్** (65.5% ఐరన్)
టన్నుకు
**రూ.5,400**
రూ.150 పెంపు



**ఫైన్స్** (61-63% ఐరన్)
టన్నుకు
**రూ.4,500**
ధరల్లో మార్పు లేదు

## ఎస్ఈఐఎల్‌తో ఒప్పందం

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్మిస్తున్న నిల్వ, బ్లెండింగ్ యార్డ్ నుంచి ఇనుప ఖనిజం తీసుకునేందుకు ఎన్ఎండీసీతో స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. విజయనగరంలోని తన ఉక్కు కర్మాగారం కోసం 61-63% నాణ్యత ఉన్న ఫైన్స్‌ను క్రమం తప్పకుండా పొందేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుందని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఎస్ఈఐఎల్ తెల్పింది.




## ఈ ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలు

విశాఖలోని నిల్వ కేంద్రం నుంచి నేరుగా ఖనిజాన్ని సేకరించడం.
రవాణా వ్యయం గణనీయంగా తగ్గుతుంది.
తమకు 61-63% నాణ్యత ఉన్న ఫైన్స్ సరఫరా నిరంతరంగా లభిస్తుంది.
సమీప భవిష్యత్తులో చేపడుతున్న ఉత్పత్తి విస్తరణకు ఈ ఖనిజ సరఫరా తోడ్పడుతుంది.

# పండగలకు తీపి కబురు

పండగలు సమీపిస్తున్నాయి. ఈ సమయంలో తీపి వంటకాలకు పంచదార వినియోగం ఎక్కువగా ఉంటుంది. అయితే అకస్మాత్తుగా చక్కెర ధర పెరగడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతుండగా, అప్రమత్తమైన ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలోనే దేశీయ చక్కెర రిఫైనరీ సంస్థలు కూడా దేశీయ విపణిలో సుమారు 2.5 లక్షల టన్నుల చక్కెర విక్రయించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు శ్రీ రేణుకా షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ బుధవారం తెలిపారు. ఇండియన్ షుగర్ అండ్ బయో-ఎనర్జీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఇస్మా) నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా విలేకరులతో కుమార్ మాట్లాడారు. దేశంలో శ్రీ రేణుకా షుగర్స్‌తో పాటు మరొకటి మాత్రమే ప్రత్యేక చక్కెర రిఫైనరీలు ఉన్నాయి. ఇవి అడ్వాన్స్ లైసెన్సింగ్ స్కీమ్ కింద ముడి చక్కెరను దిగుమతి చేసుకుని, దానిని శుద్ధి చేసి రిఫైన్డ్ షుగర్‌గా మార్చి ఎగుమతి చేస్తాయి. 'శుద్ధి చేసిన చక్కెరను ఇకపై ఎగుమతి చేయకుండా, దేశీయ మార్కెట్లోనే విక్రయించాలని' సూచిస్తూ గత నెలలో ప్రభుత్వం ఈ రిఫైనరీలకూ ఆదేశాలు జారీ చేసింది. పండుగల సీజన్‌లో దేశీయంగా చక్కెర సరఫరా పెంచి, ధరలు అదుపులో ఉంచేందుకూ ఈ చర్య చేపట్టింది. సుంకాలు లేకుండా 10 లక్షల టన్నుల ముడిచక్కెర దిగుమతికీ ప్రభుత్వం అనుమతులిచ్చింది. భారీఎత్తున పంచదార నిల్వలపైనా ఆంక్షలు విధించింది. ప్రభుత్వ చర్యల తర్వాత, దేశీయంగా చక్కెర ధరలు తగ్గాయని కుమార్ తెలిపారు. ప్రస్తుతం మిల్లుల వద్ద ధర కిలోకు సుమారు రూ.43-44గా ఉంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పంచదార ధర (కిలో సుమారు రూ.50) కంటే ఇది తక్కువ.

### చక్కెర దిగుమతులు ఇప్పటికీ లాభదాయకమే
### -ఇస్మా

దేశీయంగా చక్కెర ధరలు తగ్గుతున్నా, విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం ఇప్పటికీ వాణిజ్యపరంగా లాభదాయకమేనని ఇస్మా అధ్యక్షుడు నీరజ్ షిర్గావ్‌కర్ తెలిపారు. రెండు వారాల క్రితం కిలోకు రూ.65-67గా ఉన్న ఎక్స్-మిల్ పంచదార ధర ప్రస్తుతం కిలోకు రూ.43-44కు తగ్గిందని.. అయితే రిటెయిల్ విపణిలో ఈ ప్రభావం కనిపించడానికి ఒకటి నుంచి రెండు వారాలు పట్టొచ్చని తెలిపారు.

### 8 లక్షల టన్నుల దిగుమతికి దరఖాస్తు

సుంకాలు లేకుండా ప్రభుత్వం 10 లక్షల టన్నుల ముడిచక్కెర దిగుమతికి ప్రభుత్వం అనుమతులివ్వగా, ఇప్పటివరకు మిల్లులు 8 లక్షల టన్నుల దిగుమతికి దరఖాస్తు చేసుకున్నాయని సమాచారం. అయితే ప్రపంచ మార్కెట్లో చక్కెర సరఫరాలు తగ్గడం, మనదేశం కూడా కొనుగోలుకు ముందుకు రావడంతో అంతర్జాతీయంగా చక్కెర ధర పెరిగింది. ఇందువల్ల దిగుమతులు తమకు లాభదాయకం కావేమోనని మిల్లర్లు ఆందోళన చెందుతున్నారు. కొరత నివారణకు దేశీయంగా చక్కెర మిల్లులు సాధారణం కంటే ముందుగానే చెరకు క్రషింగ్ ప్రారంభించాల్సి వస్తే, ఎదుర్కొనే నిర్వహణాపరమైన సమస్యలను ఇస్మా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రాబోయే మార్కెటింగ్ సంవత్సరం (అక్టోబరు-సెప్టెంబరు)లో చక్కెర ఉత్పత్తి, ఇథనాల్‌కు కేటాయింపుల విషయంలో పరిశ్రమ ఆశావహంగా ఉందని నీరజ్ చెప్పారు. 2025-26 మార్కెటింగ్ సంవత్సరానికి (ఈ నెలాఖరు వరకు) చక్కెర ఉత్పత్తి అంచనాను గతంలో ప్రకటించిన 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు ప్రభుత్వం తగ్గించింది. దేశంలో వార్షిక చక్కెర డిమాండ్ సుమారు 280-285 లక్షల టన్నులుగా ఉంటుందన్నది అంచనా.



## మార్కెట్‌లోకి కొత్త
# జావా 42 ఆల్‌స్టార్స్

**క్లాసిక్ లెజెండ్స్ నుంచి ప్రీమియం బైక్.. ఈనెల 14 నుంచి డెలివరీలు**



JAWA 42 ALLSTARS

ధర
**రూ.1,79,942**
(ఎక్స్-షోరూమ్)

జావా-యెజ్డీ షోరూమ్‌లలో బుకింగ్‌లు ప్రారంభం

ఈనెల 14 నుంచి డెలివరీలు

**ముంబయి:** మహీంద్రా గ్రూప్‌కు చెందిన ప్రీమియం బైక్ బ్రాండ్ క్లాసిక్ లెజెండ్స్, తమ ఐకానిక్ శ్రేణిలో సరికొత్త జావా 42 ఆల్‌స్టార్స్ బైక్‌ను దేశీయ విపణిలోకి విడుదల చేసింది. ఈ మోటార్‌సైకిల్ ధర రూ. 1,79,942 (ఎక్స్-షోరూమ్). దేశవ్యాప్తంగా ఉన్న జావా-యెజ్డీ విక్రయశాలల్లో బుకింగ్‌లు ప్రారంభం కాగా, ఈనెల 14 నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి.

### శక్తివంతమైన ఇంజిన్:

ఈ బైక్ 294.72 సీసీ సింగిల్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌తో లభిస్తుంది. రైడింగ్ సౌలభ్యం కోసం సీటు కుషనింగ్‌ను మెరుగుపరచడంతో పాటు వెనుక భాగంలో వెడల్పైన 150/70-17 టైర్‌ను బిగించారు.

### భద్రతకు ప్రాధాన్యం:

రెండు చక్రాలకు డిస్క్ బ్రేకులు, డ్యూయల్ ఛానల్ ఏబీఎస్‌ను ప్రామాణికంగా అందిస్తున్నారు. దాంతో పాటు, క్లాసిక్ లుక్‌తో పాటు ఆధునిక ఫీచర్ల కలయికతో జావా 42 ఆల్‌స్టార్ రైడర్లకు అద్భుత అనుభూతిని అందించనుంది.

**క్లాసిక్ లుక్.. మోడరన్ టెక్నాలజీ..**
**జావా 42 ఆల్‌స్టార్స్**

లిక్విడ్ కూల్డ్ ఇంజిన్
మెరుగైన సీటు కుషనింగ్
150/70-17 వెడల్పాటి టైర్
డిస్క్ బ్రేకులు ం డ్యూయల్ ఛానల్‌ఏబీఎస్



సాంప్రదాయం.. సరికొత్త అవతారం..

# పాత ఐఫోన్‌ల ధరలు పెరిగాయ్.. ఆ వేరియంట్‌పై ఏకంగా రూ.65వేల పెంపు



స్మార్ట్‌ఫోన్ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూసిన యాపిల్ కొత్త ఫోన్లు వచ్చేశాయి. ఐఫోన్ 18 శ్రేణితో పాటు తొలి ఫోల్డబుల్ ఫోన్ 'ఐఫోన్ డ్యూయో'ను కంపెనీ విడుదల చేసింది. అయితే, అందరూ ఊహించినట్లుగానే వీటి రాకతో పాత ఐఫోన్‌ల ధరలనూ యాపిల్ పెంచేసింది. దీంతో భారత్‌లో ఐఫోన్ 17 ధర 20శాతం మేర పెరిగింది. ఇక, యాపిల్ ఎయిర్ ధర ఏకంగా రూ.65వేలు పెరగడం గమనార్హం.

సాధారణంగా యాపిల్ కొత్త ఉత్పత్తులు విడుదల చేసిన తర్వాత పాత ఐఫోన్ల ధరలను తగ్గిస్తుంది. గతంలో ఇదే విధానాన్ని అనుసరించింది. కానీ, ఈసారి మాత్రం అందుకు భిన్నంగా పాత ఐఫోన్ల ధరలను పెంచడం చర్చనీయాంశమైంది. మెమొరీ చిప్‌లు, ర్యామ్‌ల కొరత, ఏఐ డిమాండ్ వంటి కారణాలతో యాపిల్ వ్యయాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఏడాది ఆరంభంలో మ్యాక్‌బుక్‌లు, ఐప్యాడ్‌ల ధరలను కంపెనీ పెంచేసింది. ఇప్పుడు ఐఫోన్ల పెంపునకు కూడా అదే కారణమని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. పెంచిన ధరలు ఇలా ఉన్నాయి. (×జూష్ట్రశీఅవ జూతీఱఎవం ఱఅ ×అఎఱు)

ఐఫోన్ 17
256 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర గతంలో రూ.82,900 ఉండగా.. ఇప్పుడు దాన్ని రూ.99,900కు పెంచింది. అంటే రూ.17వేలు పెరిగింది.
512 జీబీ వేరియంట్ ధర రూ.1,02,900 నుంచి రూ.1,24,900కు చేరింది.


ఐఫోన్ 18 ఫోన్లు వచ్చేశాయ్

ఐఫోన్ ఎయిర్
256 జీబీ వేరియంట్ ధర ఇప్పటివరకు రూ.1,19,900 ఉండగా.. దాన్ని రూ.1,49,900కు పెంచింది.
512 జీబీ వేరియంట్ ధర రూ.1,39,900 నుంచి 1,74,900కు చేరింది.
ఇక, 1టీబీ వేరియంట్ ధర అయితే ఏకంగా రూ.65వేలు పెరిగింది. గతంలో ఈ మోడల్ ధర రూ.1,59,900 ఉండగా.. ఇప్పుడు రూ.2,24,900గా కంపెనీ నిర్ణయించింది.

ఐఫోన్ 17ఈ
256జీబీ వేరియంట్ ధర రూ.64,900 నుంచి రూ.79,900కు పెరిగింది.
512జీబీ వేరియంట్ ధర రూ.84,900 నుంచి రూ.1,04,900కు చేరింది.

ఐఫోన్ 16
128జీబీ మోడల్ ధర గతంలో రూ.69,900 ఉండగా.. ఇప్పుడు దాన్ని రూ.89,900గా నిర్ణయించింది. అంటే రూ.20వేలు పెరిగిందన్నమాట.

యాపిల్ కొత్తగా విడుదల చేసిన ఐఫోన్ 18 శ్రేణి ధర రూ.1,64,900 నుంచి మొదలైన సంగతి తెలిసిందే. ఇక, మడతబెట్టే ఐఫోన్ డ్యూయో ప్రారంభ ధర రూ.2,99,900గా ఉంది. సెప్టెంబరు 12 నుంచి ఈ కొత్త ఐఫోన్ల కోసం ప్రీ-ఆర్డర్ చేసుకోవచ్చు. సెప్టెంబరు 18 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి.



## నాగచైతన్య 'వృషకర్మ' రిలీజ్ డేట్ ఫిక్స్

నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వృషకర్మ'. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. స్పర్ష్ శ్రీవాస్తవ, జయరామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను డిసెంబర్ 4న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం గురువారం ప్రకటించింది. పురాణాంశాలతో మిళితమైన ఈ మిస్టిక్ హారర్ థ్రిల్లర్‌లో చైతన్య నిధి అన్వేషకుడిగా కనిపించనున్నారు. ఈ సినిమాకి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.

# ఆ ఒక్కటీ తప్ప దాదాపు నా జీవితంలో జరిగినవే!

"నేనొక బాధ్యతాయుతమైన వ్యక్తిని, నటుణ్ని. అందుకు తగ్గట్టే ఉంటాయి నేను చేసే సినిమాలు! మంచి ఉద్దేశంతో మనం పని చేస్తున్నప్పుడు వేరొకరి అభిప్రాయాల గురించి పట్టించుకోవల్సిన అవసరం లేదని నేను నమ్ముతా" అన్నారు యువ కథానాయకుడు ఆనంద్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా రూపొందిన సినిమా 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"మన నిజ జీవితాల్లో జరిగే సంఘటనల్ని... మనమే అద్దంలో చూసుకుంటే ఎలా ఉంటుందో అలాగే ఉంటుందీ చిత్రం. ప్రేమ, కుటుంబం, భయాలు, బాధ్యతలు... ఇలా మనందరి జీవితాల్లో ఏమేం ఉంటాయో అవన్నీ ఇందులో ఉంటాయి. అందుకే హీరో, విలన్ కథలతో రూపొందే సగటు సినిమాల్లా కాకుండా, ఒక అందమైన ప్రయాణంలా ఉంటుందీ చిత్రం. చదువుల కోసం విదేశాలకు వెళ్లినవాళ్లకే కాకుండా, కుటుంబానికి దూరంగా ఉండేవాళ్లూ ఈ కథలో తమని తాము చూసుకుంటారు. సహజీవనం నేపథ్యం ఇందులో ఉన్నా, కుటుంబ ప్రేక్షకులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా దర్శకుడు ఆదిత్య హాసన్ ఎంతో బాధ్యతాయుతంగా ఈ సినిమాని తీర్చిదిద్దాడు".



"ఈ కథ వింటున్నప్పుడు 'ఇదేంటి, నా కథలాగే ఉంది' అనిపించింది. నేను అమెరికాలో చదువుకున్నా, ఈ కథ లండన్‌లో జరుగుతుంది. ఇందులో కథానాయకుడు ఒక అమ్మాయితో సహజీవనం చేస్తాడు. నా జీవితంలో అలా జరగలేదు. ఆ ఒక్కటి తప్ప దాదాపు నా జీవితంలో జరిగిందే తెరపై కనిపిస్తుంది. నా ఒక్కడికే కాదు, జీవితాల్లో స్థిరపడాలని, ఆర్థిక సమస్యల నుంచి బయట పడాలని కుటుంబాలకు దూరంగా విదేశాల్లో గడిపేవాళ్లు చాలామందే. వాళ్లందరి కథలాగే ఉంటుందీ చిత్రం".

"సమాజంలో ఒక చర్చని లేవనెత్తే సినిమా ఇది. ఎంతగా చర్చ జరిగితే మా సినిమాకి అంత మంచిది. ట్రైలర్ విడుదలైన వెంటనే ఈ సినిమాపై చర్చ మొదలైంది. అది మంచిదే. ఒక రకంగా ట్రైలర్‌తో మేం ప్రేక్షకుల్ని ముందుగానే సిద్ధం చేశాం".

"తదుపరి 'తక్షకుడు' అనే సినిమా రాబోతోంది. మిస్టికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఆ సినిమాలో నేనొక అంధుడిగా కనిపిస్తా. దాంతోపాటు ఇండో కొరియన్ నేపథ్యంలో సాగే మరొక సినిమా చేశా".

"మా ఇంట్లో సినిమాల గురించి మాట్లాడుకునేది చాలా తక్కువ. మా కెరీర్‌ల గురించి కూడా ఎప్పుడూ ప్రస్తావన రాదు. అయితే మా అన్న విజయ్, వదిన రష్మిక ప్రతి విషయంలోనూ నాకు అండగా నిలుస్తుంటారు. నాకూ, సందీప్‌రెడ్డి వంగాకీ నిన్న జరిగిన వేడుకలో చేతి గడియారాలు బహుమానంగా ఇచ్చారు. వదిన కాలిగాయంతో ఇంట్లో ఉన్నప్పుడు పజిల్స్ ఆడుతూ గడిపేవారు. తను పజిల్స్ పూర్తి చేస్తుంటే నేనేమో చెడగొట్టేవాణ్ని. వేసవిలో ఈ సినిమా విడుదల గురించి కొంచెం ఒత్తిడికి గురయ్యాం. అప్పుడు వదిన వచ్చి... 'బాగానే ఉన్నావా? ఎక్కువ ఆలోచిస్తున్నావా? ఏమైనా మాట్లాడాలా?' అని అడిగారు".

# కుమారుడి ఫొటోను రివీల్ చేసిన వరుణ్‌తేజ్–లావణ్య దంపతులు



**నటుడు వరుణ్ తేజ్ –లావణ్య త్రిపాఠి దంపతులు తొలిసారిగా తమ కుమారుడి ఫొటోను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 10న వరుణ్–లావణ్య దంపతులకు కుమారుడు పుట్టిన విషయం తెలిసిందే. తమ కుమారుడికి 'వాయువ్ తేజ్' అని పేరు పెట్టినట్లు గతంలో వెల్లడించారు. వాయువ్ మొదటి బర్త్‌డే సందర్భంగా తొలిసారిగా చిన్నారి ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 2017లో 'మిస్టర్' సినిమా కోసం వరుణ్ – లావణ్య తొలిసారి కలిసి నటించారు. అప్పుడే ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. అనంతరం ప్రేమలో పడిన వీరు 2023 నవంబర్ 1న ఇటలీలోని టస్కానీ వేదికగా వివాహబంధంతో ఒక్కటయ్యారు.**



# నా జీవితంలోకి వచ్చిన ఒకరికి ఆస్కార్ ఇవ్వొచ్చు – జయం రవి భార్య ఆర్తి


నటుడు జయం రవి భార్య ఆర్తి పెట్టిన ఇన్‌స్టా స్టోరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడూ ఇన్‌స్టాలో యాక్టివ్‌గా ఉండే ఆర్తి తాజాగా ఓ నోట్ పంచుకున్నారు. "సూర్య, అజిత్, విక్రమ్, కమల్ హాసన్.. వీళ్లందరి కంటే నా జీవితంలోకి వచ్చి ఒకరు నటించిన నటనకి ఆస్కార్ అవార్డు కూడా ఇచ్చేయొచ్చు" అని రాశారు. తన భార్య ఆర్తి నుంచి విడిపోతున్నట్లు రవి మోహన్ 2024లో ప్రకటించారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలో మహిళలే కరెక్ట్ అని చాలా మంది అనుకుంటారని, కానీ అసలైన బాధితులు పురుషులేనని జయం రవి చేసిన కామెంట్స్‌పై ఆర్తి స్పందించారు. 'ఒకవేళ విడాకులు రాక ముందే నేను వేరే వ్యక్తితో కలిసి ఉంటే..?.అదొక అసహ్యమైన ప్రవర్తన' అని ఆమె తెలిపారు.మరోవైపు నేడు జయం రవి పుట్టిన రోజు సందర్భంగా 'వడ్డీ కాసులవాడ' మూవీ టీమ్ శుభాకాంక్షలు తెలిపింది. మనోజ్ ప్రధానపాత్రలో నటిస్తోన్న ఈ సినిమాలో రవి వెంకటేశ్వరస్వామిగా కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో, నేటి సమాజంలో సర్వసాధారణమైపోయిన ఈఎంఐలు, వాయిదాల పద్ధతులు, అప్పుల చుట్టూ తిరిగే ఓ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.

# నటిని కావాలనే కలకు అదే ప్రేరణ కృతి సనన్



చిత్ర పరిశ్రమలో కెరీర్‌కు ముందు అనుకోకుండా వచ్చిన ఓ మోడలింగ్ అవకాశం.. తనని నటనవైపు అడుగులు వేసేలా చేసిందని ఇటీవల ఓ సందర్భంలో పంచుకుంది బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్. "నాకు మోడల్ అవ్వాలనే ఉద్దేశం ఎప్పుడూ లేదు. కానీ, కొందరు నన్ను చూసి.. మోడలింగ్ ప్రయత్నించమని సలహాలు ఇచ్చారు. సరే ఓసారి ప్రయత్నించి చూద్దాం. ఏమీ కాకపోయినా అదొక అనుభవంగా ఉంటుందని అనుకున్నా. అలా నా సోదరి అనుకోకుండా తీసిన ఫొటోలను కొన్ని పోస్ట్ చేయడంతోనే మోడల్‌గా ఎంపికయ్యాను. అప్పుడు మా నాన్న 'చాలా శ్రద్ధగా చదువుతావు.. మోడలింగ్ వైపు వెళ్తే చదువుకి ఆటంకం. ఎందుకిదంతా' అన్నారు. కానీ, మా అమ్మ ఫర్వాలేదు.. ఒప్పందంపై నేను సంతకం చేస్తానని ప్రోత్సహించారు. ఆ తర్వాత టీవీ ప్రకటనలు చేయడం మొదలుపెట్టాక.. కొంచెమైనా నటించగలనని అనిపించింది. అప్పుడే నా మనసులో ఎక్కడో నెమ్మదిగా నటిని కావాలని కలలు కనడం మొదలు పెట్టాను. అలా నటిగా రాణించాలనే నా ఆలోచన మోడలింగ్‌తోనే ప్రారంభమైంద"ని చెప్పుకొచ్చింది.

# దేశభక్తి గుర్తుంది.. కానీ దేశం కాదు




బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానా, సారా అలీఖాన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'ఉద్తా తీర్'. ఆకాశ్ ఎ.కౌశిక్ దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్, అదర్ పూనావాలా, అపూర్వ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 9న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. "దేశభక్తి గుర్తుంది.. కానీ దేశం కాదు. అంతులేని గందరగోళం, అయోమయం, యాక్షన్ కోసం సిద్ధంగా ఉండండి. వచ్చే నెల ఈ సినిమా చూడండి. ఇక ఒక్క నెల మాత్రమే మిగిలి ఉంది" అనే వ్యాఖ్యను జోడించింది. ఈ పోస్టర్‌లో భారత్–పాకిస్థాన్ సరిహద్దులోని రెండు మైలురాళ్ల మధ్య ఒక ఉయ్యాలలో ఆయుష్మాన్ సరదాగా విశ్రాంతి తీసుకుంటుండగా, ఆయనపై ఒక టాప్ సీక్రెట్ ఫైల్ కనిపించిన తీరు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. గందరగోళానికి గురైన ఒక రహస్య ఏజెంట్‌కి సంబంధించిన కామెడీ చిత్రమని పోస్టర్ స్పష్టం చేస్తుంది.

# వీటిని మాయిశ్చరైజర్లుగానూ..!



చర్మం పొడిబారినప్పుడు మాయిశ్చరైజర్లు వాడడం మామూలే. అయితే దీనికోసం ఎప్పుడూ బయట ఉత్పత్తులే వాడాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు. ఇంట్లో లభించే కొన్ని సహజసిద్ధమైన పదార్థాలను కూడా మాయిశ్చరైజర్లుగా వాడుకోవచ్చని సూచిస్తున్నారు.

## మజ్జిగ, పెరుగు..

మజ్జిగ, పెరుగు మాత్రలు పులియబెట్టిన పదార్థాల్లో ల్యాక్టికామ్లం ఉంటుంది. దీనిలో చర్మానికి తేమనందించే గుణాలున్నాయని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే వీటిని ఫేస్‌మాస్కుల్లో భాగం చేసుకోవడం వల్ల చక్కటి ఫలితాలు పొందచ్చంటున్నారు నిపుణులు.



## రోజ్‌వాటర్...

రోజ్‌వాటర్ లో చర్మానికి తేమనందించే గుణాలు ఉంటాయట! ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో నింపి.. నిర్దిష్ట వ్యవధుల్లో చర్మం లేదా ముఖంపై స్ప్రే చేసుకుంటే తాజాగా ఉండచ్చంటున్నారు నిపుణులు.



## కీరాదోస

అధిక నీటి శాతం ఉండే కీరాదోస చర్మానికి తేమనందించడంలో సహకరిస్తుంది. ఇందుకోసం దీనిని తినడమే కాదు.. దీనితో ప్యాక్స్ తయారుచేసుకొని కూడా ఉపయోగించచ్చు. లేదంటే కీరా స్లైసుల్ని కనురెప్పలపై, ముఖ పరచుకొని కాసేపు సేదదీరితే చక్కటి ఫలితం ఉంటుంది ఉంటుందట.



## అరటిపండు

బాగా పండిన అరటిపండ్లను పడేయడం కంటే.. వాటిని పేస్ట్‌లా చేసుకొని చర్మంపై అప్లై చేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. పవమలు.



## తేనె

పొడి చర్మం ఉన్నవారు తేనెతో చర్మాన్ని మర్దన చేసుకొని పావుగంట తర్వాత గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. ఇలా తరచూ చేయడం వల్ల సమస్య తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు.



## ముఖ్యమైన విషయం

ఇవన్నీ సహజసిద్ధమైన పదార్థాలే అయినప్పటికీ చర్మతత్వాలను బట్టి కొంతమందికి కొన్ని పడకపోవచ్చు. కాబట్టి వాడే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మర్చిపోకూడదని సూచిస్తున్నారు నిపుణులు.



సహజసిద్ధమైన పదార్థాలతో... సొంత అందాన్ని మరింత మెరుగుపరుచుకోండి!



# కోమలమైన చర్మానికి..!

వాతావరణం ఎలా ఉన్నా సరే.. కొందరి చేతులు, కాళ్లు పొడిబారి పగులుతుంటాయి. ఇలాంటప్పుడు ఈ సింపుల్ చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు సౌందర్య నిపుణులు.

వాతావరణం ఎలా ఉన్నా సరే.. కొందరి చేతులు, కాళ్లు పొడిబారి పగులుతుంటాయి. ఇలాంటప్పుడు ఈ సింపుల్ చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు సౌందర్య నిపుణులు.

కాళ్లు, చేతులపై మృతకణాలు పేరుకున్నప్పుడు కూడా చర్మం పొడిబారి నిర్జీవంగా కనిపిస్తుంది. అందుకే వాటిని తొలగించుకునేందుకు ఇంట్లో తయారుచేసుకునే కొన్ని ప్యాక్స్, స్క్రబ్స్ అప్లై చేసుకుంటే ఫలితం ఉంటుంది. చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

రాత్రి పడుకునే ముందు కొబ్బరినూనెను చేతులు, కాళ్లు, పాదాలకు రాసుకొని మర్దన చేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల పొడిబారిన చర్మం తిరిగి మృదువుగా మారుతుందట.

గోరువెచ్చని నీటిలో కొద్దిగా వంటసోడా, ఏదైనా కొన్ని చుక్కల అత్యవసర నూనెను వేయాలి. కొన్ని గులాబీ రేకలూ వేసుకోవచ్చు. ఇందులో చేతులు, కాళ్లను ఓ పది నిమిషాల పాటు ఉంచి తీసేయాలి. ఇలా చేయడం వల్ల కాళ్లు, చేతుల చర్మం మృదువుగా మారుతుందంటున్నారు నిపుణులు.

గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఎప్సమ్ సాల్ట్ వేసుకుని అందులో చేతులు, కాళ్లను కాసేపు ఉంచాలి. పది నిమిషాల తర్వాత బయటికి తీసి కడిగేసుకోవాలి. ఆ తర్వాత కొబ్బరి / లేదా బాదం నూనె రాసుకోవడం వల్ల ఆయా భాగాలకు తేమ అందుతుందట. అంతేకాదు.. రోజంతా నడవడం వల్ల వచ్చే అలసట కూడా తగ్గుతుందట.

రాత్రి పడుకునే ముందు ఆలివ్ నూనెను కాళ్లు, చేతులకు రాసుకుని, మర్దన చేసుకున్నా మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.



# అవి రోగ్ ప్లానెట్స్!

హాయ్ ఫ్రెండ్స్..

భూమి, అంగారకుడు, బృహస్పతి వంటి గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ క్రమం తప్పకుండా తిరుగుతూనే ఉంటాయని మనందరికీ తెలుసు కదా! సూర్యుడు ఇచ్చే వెలుగు, వేడి వల్ల భూమి మీద రకరకాల మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే, సూర్యుడు సహా ఇతర ఏ నక్షత్రాల తోడు లేకుండా చీకట్లో ఒంటరిగా తిరిగే కొన్ని గ్రహాలు కూడా ఉన్నాయి. మరి వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందామా..

ఒంటరిగా శూన్యంలో తిరిగే గ్రహాలను శాస్త్రవేత్తలు 'రోగ్ ప్లానెట్స్'గా పిలుస్తారు. ఈ తరహా గ్రహాలు నిర్దిష్టమైన కక్ష్యలో ఉండవు. ఇంతకీ ఇవి ఎలా ఏర్పడతాయంటే.. ఒక నక్షత్ర వ్యవస్థ రూపుదిద్దుకునే ప్రారంభ దశలో గురుత్వాకర్షణ బలాలు చాలా తీవ్రంగా ఉంటాయి. పెద్ద గ్రహాలు చిన్న వాటిపై ఎక్కువ ఒత్తిడి తీసుకొస్తాయి. అది తట్టుకోలేక, ఆ కక్ష్యలోంచి కొన్ని బయటికి వచ్చేస్తాయి. అలా రోగ్ ప్లానెట్స్ రూపొందుతాయి. మరికొన్ని ఏమో అంతరిక్షంలో కొన్ని వాయువులతో కలిసి, దుమ్మూ ధూళి మేఘాలు కుంచించుకుపోవడం వల్ల కూడా ఏర్పడతాయి. వీటికి వెలుగు, వేడిని ఇచ్చే నక్షత్రం ఉండదు కాబట్టి.. వాటి దగ్గర మైనస్ 200 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉంటుంది. రోగ్ ప్లానెట్స్ చీకట్లో ఉంటాయి కాబట్టి టెలిస్కోప్ ద్వారా చూడటం కష్టం. అందుకే శాస్త్రవేత్తలు 'గ్రావిటేషనల్ మైక్రోలెన్సింగ్' అనే ప్రత్యేక పద్ధతిని ఉపయోగిస్తారు. అంటే ఈ గ్రహం ఏదైనా దూరంగా ఉన్న నక్షత్రం ముందు నుంచి వెళ్లినప్పుడు, దాని గురుత్వాకర్షణ వల్ల వెనక ఉన్న నక్షత్ర కాంతి కొద్దిగా వంగుతుంది. ఆ మార్పును బట్టి అక్కడ రోగ్ ప్లానెట్ ఉందని గుర్తిస్తారు. నేస్తాలూ.. ఈసారి రాత్రి ఆకాశంలో నక్షత్రాలను చూస్తున్నప్పుడు వాటి మధ్యలో మనకు కనిపించని బోలెడు గ్రహాలు ఉన్నాయని గుర్తు చేసుకోండి. ఈ ఆసక్తికరమైన విషయాన్ని మీ స్నేహితులతోనూ పంచుకోండి.



# బాతు ఎందుకు తడవదు?

ఫ్రెండ్స్.. మీరెప్పుడైనా బాతులను గమనించారా! చాలావరకు నీటిలోనే ఉంటాయి. అందులో ఉన్నప్పుడుగానీ బయటికి వచ్చాకగానీ వాటి రెక్కలకు ఏమాత్రం తడి ఉన్నట్లుగా అనిపించదు కదా. వాటి రెక్కల మీద నుంచి ముత్యాల్లా నీటి బిందువులు రాలిపోతాయి... ఎందుకంటారు?

బాతు ఎంతసేపు నీళ్లలో ఉన్నా దాని శరీరం అస్సలు తడిగా అవ్వదు. ఎందుకంటే బాతు శరీరంలో ఉండే ప్రత్యేకమైన గ్రంథే అందుకు కారణం. బాతు తోక, వెనక భాగం వైపున అలాగే అడుగు భాగంలో ఆయిల్ గ్లాండ్ ఉంటుంది. సైన్స్ భాషలో దాన్ని యూరోపైజియల్ గ్లాండ్ అని పిలుస్తారు. ఈ గ్రంథి ఎప్పుడూ ప్రత్యేకమైన మోనో-ఎస్టర్ తైలం అంటే.. నూనె, మైనం కలిసిన పదార్థాన్ని విడుదల చేస్తుంది. తైలం విడుదలయ్యే గ్రంథిని బాతు ముక్కుతో పదే పదే తాకుతుంది. తరవాత ఆ నూనెను శరీరమంతా సమంగా పూస్తుంది. ఈ ప్రక్రియను పక్షుల భాషలో ప్రీనింగ్ అంటారు. నీళ్లు, నూనె ఎప్పటికీ కలవవు అనే విషయం మనకు తెలిసిందే కదా నేస్తాలూ.. బాతు ఈకల మీద నూనె పూత ఉండటం వల్ల నీటి బిందువులు దాని రెక్కల మీదకు రాగానే ఇంకిపోకుండా జారిపోతుంటాయి. మరో విషయం ఏంటంటే.. బాతు నీటిలో తడవకుండా ఉండటానికి దాని శరీరంలో విడుదలయ్యే నూనెలు ఒక కారణం అయితే.. బాతు ఈకల అల్లిక విధానం మరో ప్రధాన కారణం. దాని ఈకలు జిప్పర్ విధానంలో అల్లుకుని ఉంటాయి. అది నీటి బిందువులు కూడా ప్రవేశించలేనంత దృఢంగా ఉంటుంది. ఆ నిర్మాణమే బాతు నీటిపై సులభంగా తేలడానికి సహాయపడుతుంది. అలాగే చల్లని నీటిలో ఉన్నప్పుడు శరీరం వెచ్చగా ఉండేలా ఉష్ణ నిరోధకంగానూ పని చేస్తుంది. బాతు ఈకల ఉపరితలానికి ఉన్న గుణాన్ని హైడ్రోఫోబిక్ విధానం అంటారు. ఈ విశేషాలు మీకెలా అనిపించాయి నేస్తాలూ!



# గొడవపడొద్దు సరేనా!

గీత, వేద్ అన్నాచెల్లెళ్లు.. ఇద్దరూ చాలా మొండిగా ఉంటారు. అలా ఉండకూడదని వాళ్లమ్మ ఎన్నిసార్లు చెప్పినా, అస్సలు వినరు. ఆట బొమ్మలు, టీవీ రిమోట్ ఇంకా చాలా విషయాల్లో ఎప్పుడూ గొడవ పడుతూనే ఉంటారు. ఒకసారి ఇలాగే ఇద్దరూ పోట్లాడుకుంటుంటే.. వేద్ చేతికి పెద్ద గాయమైంది. వారం రోజుల పాటు స్కూల్‌కి కూడా వెళ్లలేకపోయాడు. అలా కొన్ని రోజులు గడిచిపోయాయి. గీత వాళ్ల ఇంటికి తన స్నేహితురాలు శ్వేత వచ్చింది. 'ఉదయాన్నే ఏం తయారు చేస్తున్నావు?' అని అడిగింది. గ్రీటింగ్ చేస్తున్నానంది గీత. 'చాలా బాగుంది.. మీ అన్నయ్య కోసమే కదా!' అంది శ్వేత. 'అవును.. ఈరోజు రాఖీ పండుగ కదా! అన్నయ్యకు ఇవ్వడానికే చేస్తున్నాను' అంది గీత. 'ఎప్పుడు చూసినా మీ ఇద్దరూ గొడవ పడుతూనే ఉంటారు. కానీ తన కోసమని నిన్నేమో రాఖీ తయారు చేశావు.. ఇప్పుడేమో గ్రీటింగ్. ఇంకా ఏవో గిఫ్ట్స్ కూడా ఉన్నట్లున్నాయి?' అడిగింది శ్వేత. 'అన్నయ్యకు నచ్చిన కొన్ని బొమ్మలు నా పాకెట్ మనీతో కొన్నాను' అంది గీత.

ఇంతలోనే వాళ్లమ్మ రాఖీ కట్టడానికి అంతా సిద్ధం చేసింది. వేద్‌కు రాఖీ కట్టి.. తాను తెచ్చిన బొమ్మలు, రాసిన లెటర్ కూడా ఇచ్చింది గీత. అందులో.. 'అన్నయ్యా! రోజూ మనిద్దరం స్కూల్‌కు కలిసి వెళ్లడం చాలా బాగుంటుంది. అప్పుడప్పుడు మనం బొమ్మల కోసం గొడవ పడతాం కదా, అప్పుడు నాకు బాధగా అనిపిస్తుంది. మొన్న నీకు చేతికి గాయమైనప్పుడు కూడా బాధగా అనిపించింది. ఇక నుంచి మనం అస్సలు గొడవ పడొద్దు. చక్కగా కలిసి ఆడుకుందాం.. చదువుకుందాం' అని రాసింది. అది చదివి వేద్ చాలా ఆనందించాడు.. పాత గొడవలు తలచుకుని బాధ పడ్డాడు కూడా! తను తీసుకొచ్చిన చాక్లెట్స్‌ను చెల్లికి ఇచ్చి.. 'నువ్వు చెప్పినట్లుగానే మనం ఇక నుంచి అస్సలు గొడవపడొద్దు.. ఇద్దరం కలిసే టీవీ చూద్దాం, కలిసే ఆడుకుందాం సరేనా గీతా!' అన్నాడు వేద్. అది చూసి వాళ్లమ్మ కూడా చాలా సంతోషించింది.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం




# విశ్రాంత భవన్ లా "బాలభవన్"










**నిద్రపోతూ హాయిగా సేదతీరుతున్న టీచర్లు**
**పర్మనెంట్ ఎంప్లాయిస్ ని పక్కన పెట్టి పని కల్పించని డైరెక్టర్**
**అనర్హులకు అకౌంట్స్ అప్పచెప్పిన డైరెక్టర్**

**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9:**
బాల బాలికలకు లలితకళలలో శిక్షణ ఇచ్చే జవహర్ బాలభవన్ సబ్జెక్టు స్కూల్ టీచర్ లకు పునరావాస కేంద్రంలా తయారయ్యింది. నగరం నడిబొడ్డున అసెంబ్లీకి కూతవేటు దూరంలో ఉన్న బాలభవన్ లో ఉపాధ్యాయులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు సంగీతం, నాట్యం, చిత్రలేఖనం వంటి తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు బాల భవన్లు
ఏర్పడ్డాయి. ఆయా రంగాల్లో నియమించబడిన టీచర్లు మాత్రమే వీరికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జిల్లాలో పనిచేసే సబ్జెక్టు టీచర్లు తమ రాజకీయ పలుకుబడితో అనారోగ్య కారణాలు చూపించి డిప్యుటేషన్పై లలిత కళల్లో అర్హత లేకున్నా వారు బాలభవన్ లో పనిచేస్తున్నారు. మ్యాథ్స్, సైన్సు, సోషల్ పాఠాలు చెప్పే టీచర్లను తీసుకువచ్చి సంగీతం, నాట్యం, చిత్రలేఖనంలలో విద్యార్థులకు బోధిస్తున్నారు. అసలు వారికి లలిత కళల్లో ఏమి చెప్పాలో టీచర్లకు తెలియక ఉదయం నుండి సాయంత్రం వరకు బాలభవన్ లో హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. వేలకు వేలు జీతాలు తీసుకుంటూ అటు జిల్లాలో ఉండే విద్యార్థులకు పాఠాలు చెప్పక, ఇటు బాలభవన్లో ఉండే విద్యార్థులకు ఏమి చెప్పాలో తెలియక ఖాళీగా ఉంటూ సేద తీరుతూ కాలక్షేపం చేస్తున్నారు.
ఆఖరుకు బాలభవన్కు విద్యార్థులు రావడమే మానేశారు. ఇవన్నీ బాలభవన్ కు ఇన్చార్జి డైరెక్టర్ గా ఉన్న విజయబాయి ముందే జరగడం గమనార్హం. ఇవన్నీ డైరెక్టర్ కు తెలిసినా మిన్నకుండిపోవడం విస్మయానికి గురిచేస్తోంది. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా రాణించాలని ప్రభుత్వం కృషి చేస్తోంటే స్వయానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న విద్యాశాఖలోని బాల భవన్లో నిద్రావస్థ రాజ్యమేలుతోంది. బాల భవన్ డైరెక్టర్ అసమర్థత వల్ల జిల్లాల్లో ఉండే బాలభవన్ లు పతనావస్థకు చేరాయి. కళాసంస్థ అయినా జవహర్ బాలభవన్ లో స్కూల్ టీచర్ కి ఎస్టాబ్లిష్ మెంట్ సెక్షన్ లో డిప్యుటేషన్ పై వచ్చిన టీచర్ వల్ల ఎన్నో తప్పులు జరుగుతున్న డైరెక్టర్ మాత్రం డిప్యుటేషన్ టీచర్కే వత్తాసు పలుకుతూ బాల భవన్ ను అభాసుపాలు చేస్తోంది. ఈ

### డైరెక్టర్ అసమర్థత వల్ల

వనపర్తి, మహబూబ్ నగర్ బాలకేంద్రాల భవనాలు ఇతర శాఖల వారు హస్తగతం చేసుకున్న అపవాదు కూడా ఉంది. విద్యార్థులు ఉన్నా టీచర్ లు లేక సికింద్రాబాద్, ఓల్డ్ సిటీ బాలభవన్ లు ఇప్పటికే మూతపడ్డాయి. ఖమ్మం బాలభవన్ లో డాన్స్ మాస్టర్ గత 4 ఏళ్లుగా రాకున్నా ఎలాంటి పనిష్మెంట్ ఇవ్వకపోగా వారికి డైరెక్టర్ వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియారిటీ లేకున్నా కూకట్ పల్లి బాలకేంద్రానికి పార్ట్ టైం నుండి ఫుల్ టైం పోస్ట్ ఇవ్వటానికి డైరెక్టర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా తన
ఇష్టారాజ్యంగా డైరెక్టర్ వ్యవహరిస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన రామచంద్ర అనే స్టెనోగ్రాఫర్ తప్పుడు సర్టిఫికేట్స్ ఇచ్చి సీనియర్ అసిస్టెంట్ గా ప్రమోషన్ తీసుకోగా ప్రభుత్వం ఇతడిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేసింది. తిరిగి అతడిని ఉద్యోగంలోకి తీసుకోవాలనే ఉద్దేశ్యంతో డైరెక్టర్ విజయలక్ష్మిబాయి ప్రయత్నాలు సాగిస్తోందని విశ్వసనీయ సమాచారం. సస్పెండ్ అయిన రాంచందర్ 22 లక్షల వేతనాన్ని తీసుకున్న విషయం కోర్ట్ కి కాని ప్రభుత్వానికి గాని తెలియపరచకుండా అలసత్వం వహించి మళ్లీ ఉద్యోగం లో చేర్చుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అస్సలు బాలభవన్ కు సంబంధం లేని టీచర్లకు యేండ్లకు యేండ్లు డిప్యుటేషన్ ఇచ్చుకుంటూ డైరెక్టర్ విజయలక్ష్మిబాయి అన్నీ తానై వ్యవహరిస్తుశీదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాలభవన్ కు చెందిన క్యాంటీన్ డబ్బులు కూడా ఎస్టాబ్లిష్మెంట్ ఇంచార్జ్ ఆమె సొంత అకౌంట్లో వేయించుకుంటుందని, దీని ద్వారా బాల భవన్ కు రావలసిన ఆదాయానికి గండి పడుతోందని ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కూడా పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఆ క్యాంటీన్ ని తీసివేయడం గమనార్హం.
ఇటీవల తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్పర్సన్ సీతాదయాకర్ రెడ్డి జవహర్ బాల భవన్ ను ఆకస్మికంగా సందర్శించడంతో పలు విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఓ ఉపాధ్యాయురాలి సీతా దయాకర్ రెడ్డి ఒక ప్రశ్న వేయగా ఆమె బదులుయిచ్చిన సమాధానంతో ఆశ్చర్యం పోవడం ఆమె వంతు అయింది. ఇంత దారుణమైన పరిస్థితులు బాలభవన్ లో దాపురించాయని సీతా దయాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.
ఎస్. విజయలక్ష్మి
(బాలభవన్ డైరెక్టర్)
ప్రియదర్శిని ఆడిటోరియం త్వరలోనే అందుబాటులోకి వస్తుంది. కళల్లో ప్రావీణ్యం కలిగిన ఉద్యోగులు ఉన్నారు. ఎలాంటి సిబ్బంది కొరత లేదు. ఆరోపణలు అవాస్తవం.

## పుల్లాయగూడెంలో మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్ నర్రాముల రామలింగయ్య యాదవ్



**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు10:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పుల్లాయగూడెం గ్రామం మహిళా సంఘాలకు సొంత భవనం కల్పించే దిశగా గ్రామంలో కీలక అడుగు పడింది. గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి గురువారం రోజు సర్పంచ్ నర్రాముల రామలింగయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి స్థలాన్ని మాజీ సర్పంచ్ పెసరు గిరిజ గోపాల్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి తడిసిన మల్లారెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈ మల్లేష్,ఉప సర్పంచ్ తండ రమేష్ గౌడ్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,వార్డు సభ్యులు,గ్రామస్తులు,మహిళా సంఘాల సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఖప్రాయిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ దశమ్మకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ(రాష్ట్రణ) పట్టా ప్రధానం






**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు10:**
హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో ఆత్మకూరు(ఎం)మండలం ఖప్రాయిపల్లి గ్రామానికి చెందిన బుంగా దశమ్మ పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు.ఈ స్నాతకోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ ఎల్లా, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ మరియు రిజిస్ట్రార్ తదితరుల చేతుల మీదుగా ఆమె ఈపట్టాను స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దశమ్మ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం నుండి ప్రొఫెసర్ బి. లావణ్య పర్యవేక్షణలో పీహెచ్‌డీ పట్టా పొందడం తనకు అత్యంత సంతోషాన్నిస్తోందని పేర్కొన్నారు. తన ఈ సాధనలో ఎంతో సహకరించిన తల్లిదండ్రులు కీర్తిశేషులు బుంగా వెంకయ్య మరియు మణెమ్మలకు, తన భర్త ఆకుల శ్యాంసుందర్‌కు, ఇతర కుటుంబ సభ్యులకు, అలాగే తోడ్పాటునందించిన అధ్యాపకులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## సికింద్రాబాద్ జిల్లా మెట్టుగూడ రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో.వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు

**ట్రైన్ న్యూస్ సికింద్రాబాద్సెప్టెంబర్:10/09/2026**
తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి ప్రజల హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ శ్రీ ర్యాల రాజేందర్ యాదవ్ గారు వర్ధంతి సందర్భంగా పూల మాల వేసి నీవార్డులు అరిపించారు.





సామాజిక, ఆర్థిక అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా నిలబడి, పేదలు మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారు. భూస్వామ్య దోపిడీకి ఎదురొడ్డి నిలిచిన ఆమె పోరాట స్ఫూర్తి తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుంది.
చాకలి ఐలమ్మ జీవితం మహిళా ధైర్యానికి, ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయం కోసం పోరాడే సంకల్పానికి ప్రతీక. ఆమె ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పిస్తూ, ఆమె సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.
జై చాకలి ఐలమ్మ!
జై తెలంగాణ!

## సికింద్రాబాద్ జిల్లా సెక్రటరీ రాజేందర్ యాదవ్ రెండో ఫేస్ సార్ న్యూ ఓటర్లు ఫామ్ 6 డిస్ట్రిబ్యూషన్

**ట్రైన్ నెట్ న్యూస్ సికింద్రాబాదసెప్టెంబర్:10/09/2026**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి --
సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ శ్రీ ర్యాల రాజేందర్ యాదవ్
ఈరోజు రెండో ఫేస్ కార్యక్రమం లో భాగంగా
మెట్టుగూడ కాంగ్రెస్ పార్టీ హెల్ప్ డిస్క్ ఎరుపాటు చేసి ఓటర్లు కి ఫార్మ్ 6 పంపిన చేసారు
ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ డివిజన్ నాయకులు ప్రీథ్వీ రాజ్ గడ్డం మహేందర్
మరియు మహిళా నాయకురాలు రూత్ క్లారి, కస్తూరి, సంతోషి , సుజాత నిర్మల తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు లపై లైంగిక వేధింపుల కేసు

**మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:**
తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో సహ నలుగురు బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో ఈ కేసును నమోదు చేశారు. ఇటీవల తెలంగాణ శాసనసభ గేటు ముందు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విధి నిర్వహణలో ఉన్న తన పట్ల సదరు నేతలు అభ్యంతరకరంగా ప్రవర్తించారని, లైంగికంగా వేధించారని ఓ మహిళా కానిస్టేబుల్ సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేటీఆర్, హరీశ్ రావు తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్స్ ) సెక్షన్ల కింద సైఫాబాద్ పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు.

## వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు10:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం గురువారం రోజు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలో రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంగడి ప్రదేశంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శి పైళ్ళ ప్రశాంత్, ఎలిమినేటి నరేష్, రజక సంఘం రాష్ట్ర నాయకులు ఎలిమినేటి బుచ్చయ్య, మాజీ అధ్యక్షులు వెలిమేకన్నె సత్యనారాయణ, ఐలమ్మ విగ్రహ నిర్వహణ కమిటీ చైర్మన్ ఎలిమినేటి నగేష్, సీనియర్ జర్నలిస్ట్ ఎలిమినేటి జహంగీర్,రజక సంఘం సభ్యులు యాదయ్య, కరకయ్య,మల్లయ్య,రాములు, శంకరయ్య, స్వామి,సత్తయ్య, ఉప్పలయ్య, పుల్లయ్య,శ్రీను, కిష్టయ్య,శాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోజు శ్రీ త్యాగరాయగానసభ లో జరిగిన కార్యక్రమాలు

హైదరాబాద్, చిక్కడపల్లి,ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 10 :

ఈ కార్యక్రమాలు అనికూడా trinet live మరియు ganasabha tv యూట్యూబ్ ఛానెల్ లో ప్రత్యక్ష ప్రసారం జరిగాయి













# ఓయూలో ఐయూఈసీ 15వ జాతీయ సదస్సు ప్రారంభం..








**ఉన్నత విద్య-ప్రస్తుత స్థితిగతులు'పై మూడు రోజుల పాటు చర్చలు..**

ఉస్మానియా యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ :

అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య (ఏఐయూఈసీ) ఆధ్వర్యంలో 'ఉన్నత విద్య-ప్రస్తుత స్థితిగతులు' అనే అంశంపై 15వ జాతీయ మూడు రోజుల సదస్సు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైంది. ఓయూ ఎన్జీవోల సంఘం, ఓయూ స్టాఫ్ అసోసియేషన్, ఓయూ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు, 1,000 మందికి పైగా భాగస్వాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల ఆధునీకరణ, విద్యా ప్రమాణాల పెంపు, ఉన్నత విద్యా సంస్కరణల సమర్థవంతమైన అమలుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ దేశ నిర్మాణంలో విశ్వవిద్యాలయాల పాత్ర కీలకమని, వర్సిటీ పాలన, అభివృద్ధిలో బోధనేతర సిబ్బంది, సేవా సంఘాలు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. టీజీసిహెచ్ఈ కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ మారుతున్న పాలనా, విద్యా విధానాలకు అనుగుణంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆర్ట్స్ అండ్ సామాజిక శాస్త్రాల కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాశీం విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు గణనీయంగా పెంచాలని కోరారు. అకాడమిక్ ఆడిట్ డైరెక్టర్ ఆచార్య ఎన్. కిషన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, సేవా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. సెప్టెంబర్ 12 వరకు జరిగే సదస్సులో విద్యా విధానాలు, పాలనా సంస్కరణలు, పరిశోధన, సిబ్బంది సంక్షేమంపై పలు సాంకేతిక సదస్సులు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఏఐయూఈసీ ప్రెసిడెంట్ బి.ఎస్. హోట, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.బి సజ్జన్, సెక్రెటరీ అంజన్ గోష్, మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు, కంతం ప్రేమ్ కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ అబ్దుల్ ఖాదీర్ ఖాన్, కన్వీనర్ కె.ఎస్ నాగరాజ రావు, జనరల్ సెక్రెటరీ అక్బర్ బేగ్, జాయింట్ సెక్రెటరీ పి. పవన్ కుమార్, ట్రెజరర్ బి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వర్సిటీ లో 50% రాయితీ తో పుస్తక ప్రదర్శన

తెలుగు యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 10:

తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతిపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు , పరిశోధకులకు , సాహిత్యాభిమానులకు ఉపయోగపడేలా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణల విభాగం 50 శాతం ప్రత్యేక రాయితీ తో పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నారు. నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న తరతరాల తెలుగు జాతి మ్యూజియంలో ఈ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు.



సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 3 వరకు కొనసాగనున్న ఈ పుస్తక ప్రదర్శన కార్యాలయ పనిదినాలలో ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుస్తకాల విక్రయం ఉంటుందని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. ఈ ప్రదర్శనలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు, జానపదం తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండనున్నాయి. తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన పుస్తకాలతో పాటు వివిధ అంశాలపై పరిశోధన చేసిన ప్రముఖుల సిద్ధాంత గ్రంథాల ప్రచురణలు కూడా విద్యార్థులు, పరిశోధకులకు ఉపయోగపడేలా ఒకే చోట లభ్యం కానున్నాయి. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడంతో పాటు తెలుగు సాహిత్యాన్ని మరింత విస్తృతంగా పాఠకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు , హైదరాబాద్ నగరంలోని తెలుగు సాహిత్యాభిమానులు, విద్యార్థులు, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రిజిస్ట్రార్ విజ్ఞప్తి చేశారు.

# భారతదేశపు స్ట్రీమింగ్ లో సరికొత్తగా బ్రాండ్ న్యూ జీ5 (వవ 5).. స్పెషల్ ఫీచర్స్ ఇవే

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10 :
భూదాన్పన తెలంగాణ

ప్రేక్షకులకు అందుబాటులో ఉన్న వినోద సాధనాలు మునుపెన్నడూ లేనంతగా పెరుగుతున్న ఈ తరుణంలో, ప్రముఖ ఓటీటీ దిగ్గజం జీ5 (వవ 5) సరికొత్తగా అడుగులేస్తోంది. తన కంటెంట్ పరిధిని మరింతగా విస్తరిస్తూ, ప్లాట్‌ఫారమ్‌లో అత్యంత కీలకమైన, విప్లవాత్మకమైన మార్పులను తీసుకొస్తోంది. మొబైల్, కనెక్టెడ్ టీవీ (జశీఅవఉఏవఎ ఎ) వినియోగదారుల కోసం అత్యాధునిక ఏఐ (ూ×) ఆధారిత పర్సనలైజేషన్, ఆకర్షణీయమైన విజువల్ నావిగేషన్, స్లాట్-రహిత క్రాస్-స్క్రీన్ అనుభవాలతో ప్లాట్‌ఫారమ్‌ను అప్‌గ్రేడ్ చేసింది.

భారతీయ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ కొత్త జీ5.. ఐదు విభిన్న విభాగాలతో (ప్రీమియం ఎంటర్‌టైన్‌మెంట్, ఫ్రీ 5, కిడ్జ్, టీవీ, స్పోర్ట్స్) వినోదాన్ని వెతకడాన్ని మరింత సులభంగా, లీనమయ్యేలా మార్చింది.

న్యూ జీ 5 ప్రత్యేకతలు చూస్తే..

ఏఐ ఆధారిత పర్సనలైజేషన్: ఈ కొత్త అనుభవంలో పర్సనలైజేషన్ అనేది కీలకం. ప్రేక్షకుల అభిరుచులకు సరిపోయే కంటెంట్‌ను సులభంగా సెర్చ్ చేసేలా ఏఐ (ూ×) టెక్నాలజీ సహాయపడుతుంది.

క్రాస్-స్క్రీన్ ఎక్స్‌పీరియన్స్: మొబైల్ నుండి పెద్ద తెర (టీవీ)కి మారినప్పుడు ఎలాంటి అంతరాయం లేకుండా కంటెంట్‌ను ఆస్వాదించవచ్చు.

ఏఐ కస్టమర్ సపోర్ట్: సబ్‌స్క్రిప్షన్లు, ప్లేబ్యాక్, యాక్సెస్, పరికరాలకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు నెక్స్ట్-జనరేషన్ ఏఐ ఆధారిత కస్టమర్

# ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు :మంత్రి రాజనర్సింహ



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకంను అమలు చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ అంశంపై గురువారం శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. జూలై 17 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని మంత్రి తెలిపారు. చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన నూతన ఈహెచ్ఎస్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశామని చెప్పారు. 30 మంది సభ్యులతో ఉన్న ఈ ట్రస్ట్‌లో ఉద్యోగ సంఘాల నుంచి 10 మంది, పెన్షనర్ సంఘాల నుంచి 3 మంది, ప్రభుత్వం నుంచి 16 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు.

**నెలకు రూ.88 కోట్ల నిధులు**

ఉద్యోగులు, పెన్షనర్లు తమ బేసిక్ పే/చివరిగా పొందిన పెన్షన్‌లో 1.5 శాతం చొప్పున నెలకు చెల్లిస్తుండగా, అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా ఇస్తోందని మంత్రి తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి నెలకు రూ.44 కోట్లు, ప్రభుత్వం నుంచి మరో రూ.44 కోట్లు కలిపి నెలకు రూ.88 కోట్లు సమకూరుతున్నాయని చెప్పారు. ఈ పథకానికి ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్ ఉందని తెలిపారు.

**921 ఆసుపత్రుల్లో వైద్యం**

నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద 921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇందులో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు.

**37 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు**

ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఓపీ వైద్యం, వైద్య పరీక్షలు, మందులు అందించేందుకు ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇందులో 21 జిల్లాల్లో, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరిలో అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో మరో 4 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో మొత్తం వెల్‌నెస్ కేంద్రాల సంఖ్య 37కు చేరుతుందని చెప్పారు. ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్లు

పథకం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీ-ఆథరైజేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. 17 లక్షలకు పైగా లబ్ధిదారులు

నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని మంత్రి తెలిపారు. అర్హులైన వారికి డిజిటల్ ఆరోగ్య కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా జారీ చేస్తున్నామని చెప్పారు. ఓటీపీ ద్వారా స్వయంగా హెల్త్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. అందరికీ హెల్త్ కార్డులు ఇస్తామని, ఉద్యోగులు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత కొనసాగించాలి: మంత్రి వాకిటి శ్రీహరి

**అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటమే ఐలమ్మకు నిజమైన నివాళి**

**రవీంద్రభారతిలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్**



రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:

ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి దిశగా తీసుకెళ్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజనుల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చాకలి ఐలమ్మ సేవలను, పోరాట స్ఫూర్తిని గౌరవిస్తూ మెడికల్ కాలేజీకి ఆమె పేరు పెట్టామని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనలో బీసీల జనాభా లెక్కలను కూడా తేల్చాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే కచ్చితమైన గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ బహుజనుల కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప నాయకురాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సామాజిక అన్యాయాన్ని, దోపిడీని, పెత్తందారీ వ్యవస్థను ఎదిరించి పేదలు, బలహీన వర్గాల పక్షాన నిలిచిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. మహనీయుల జయంతులు, వర్ధంతులను నిర్వహించడం మాత్రమే కాకుండా వారి పోరాట స్ఫూర్తిని నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సర్వాయి పాపన్న, పండగ సాయన్న, చాకలి ఐలమ్మ వంటి మహనీయులు అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. సమాజం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ నేటికీ వివక్ష కొనసాగుతుండటం అత్యంత బాధాకరమన్నారు. సామాజిక అసమానతలు పూర్తిగా తొలగిపోయే వరకు అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136